

ప్రధాని పాల్గొనే హిల్‌వ్యూ స్టేడియంలో సభకు ఏర్పాట్లు



సభా వేదిక వద్ద డాగ్‌స్క్వాడ్ తనిఖీలు



పరిసరాలను అరటి గెలలతో అలంకరిస్తూ..

సంబరాల సందడి..!

పుట్టపర్తికి వేలాదిగా వస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు

నేడు గవర్నర్, డిప్యూటీ సీఎం, లోకేశ్ రాక

రేపు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు రాక

22, 23 తేదీల్లో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటన

భద్రతావలయంలో పుట్టపర్తి.. పరిసర ప్రాంతాలు



లేజర్ షోలో సత్యసాయి బాబా

పుట్టపర్తి, టౌన్, రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి వేడుకలకు వచ్చే భక్తులతో పుట్టపర్తి అలరారుతోంది. మహా సమాధిని వేలాది మంది దర్శించుకుంటున్నారు. సాయికుల్వంతు సభా మంటపంలో సోమవారం పండిట్ విశ్వనాథ్‌మోహన్ భట్ బృందం వీణావాయిద్యం భక్తులను అలరించింది. చిత్రావతి నదిలో లేజర్ షో ఆకట్టుకుంటోంది. ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి లేజర్ షోను వీక్షించారు. చిత్రావతినది తీరం భక్తులతో కిటకిటలాడింది. మరోవైపు మంగళవారం నిర్వహించే సత్యసాయి రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా 30 అడుగుల ఎత్తైన వెండిరథాన్ని సిద్ధంచేశారు. రథోత్సవం తిలకించడానికి వేలాది మంది భక్తులు ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు.

రేపు ప్రధాని.. 22న రాష్ట్రపతి రాక

శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు బుధవారం పుట్టపర్తికి వస్తున్నారు. ప్రధాని బుధవారం ఉదయం సత్యసాయి మహాసమాధిని దర్శించుకుని, హిల్ వ్యూ స్టేడియంలో జరిగే ఉత్సవాల్లో పాల్గొంటారు. ప్రధాని పర్యటనకు భద్రతను పటిష్టం చేశారు. సత్యసాయి విమానాశ్రయం నుంచి ప్రశాంతి నిలయం, హిల్‌వ్యూ స్టేడియం దాకా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 22న రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, సీఎం, పలురాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు వస్తున్నారు. వీరి కోసం విమానాశ్రయంతోపాటు నాలుగు చోట్ల హెలిప్యాడ్‌లు ఏర్పాటు చేశారు. కాన్వాయ్ వెళ్లే మార్గంలో గట్టి భద్రత ఏర్పాటు చేశారు. భక్తుల కోసం హిల్ వ్యూ స్టేడియం సభావేదికకు ఇరువైపులా ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు.

అదనపు డీజీ సమీక్ష

జాతీయ స్థాయి వీవీఐపీల పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఏపీ లా అండ్ ఆర్డర్ అదనపు డీజీ మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. ఈ నెల 19న ప్రధాని, 22, 23న రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి సహా పలువురు వీవీఐపీలు, వీఐపీలు పుట్టపర్తికి వస్తున్నారు. దీంతో డీపీఓ సమీపంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఐజీ శ్రీకాంత్, డీఐజీలు షిమోషి, ఫక్కీరప్ప, అన్బురాజన్, సత్యయేసుబాబు, ఎస్పీలు సతీష్‌కుమార్, జగదీష్, పరమేశ్వర్ రెడ్డి, రాధిక, దీపికా పాటిల్, కృష్ణకాంత్ పటేల్, రాణా, సునీల్ టైనీ తదితర ఉన్నతాధికారులతో ఆయన భద్రతపై సమీక్ష నిర్వహించారు. వీవీఐపీల (మిగతా 6లో...)

విస్తృత ఏర్పాట్లు: కలెక్టర్

శతజయంతి వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. వేడుకలను చారిత్రాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సూచనలు చేసిందని తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నాయని తెలిపారు. వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తదితర ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు. పుట్టపర్తికి ఇప్పటి వరకూ 96,250 మంది భక్తులు వచ్చారని, వారిలో చాలా మంది సాయి 100 యాప్‌లో వివరాలు నమోదు చేసుకున్నారని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం జిల్లాలోని రైల్వేస్టేషన్ల నుంచి పుట్టపర్తికి 19 ప్రత్యేక బస్సులను ఉచితంగా నడుపుతున్నామని, ఇప్పటి వరకు 1101 మంది యాత్రికులు వాటిని వినియోగించుకున్నారని తెలిపారు. వాహనాల పార్కింగ్ కోసం కర్ణాటక నాగేపల్లి, శిల్పారామం, సాయినగర్ క్రికెట్ గ్రౌండ్, అమూల్యా లే అవుట్, పరేడ్ గ్రౌండ్, ఆనంద్ విలేజ్, సందీప్ బెల్యా, చెరుకూరి గ్రౌండ్, బుక్కపట్నం రోడ్డు, కమ్మవారిపల్లి తదితర పది ప్రాంతాలలో ఏర్పాట్లు చేశామని తెలిపారు. 24,400 మందికి తాత్కాలిక వసతి కల్పించామని తెలిపారు. అత్యవసర వైద్య సేవల కోసం 108 అంబులెన్స్ వాహనాలు, 12 అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్, 26 బేసిక్ లైఫ్ సపోర్ట్ వాహనాలను సిద్ధం చేశామని తెలిపారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

మంత్రుల సమీక్ష

ప్రధాని మోదీ పర్యటనపై కలెక్టరేట్‌లో మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి సవిత, రాష్ట్ర నోడల్ అధికారులు కృష్ణబాబు, జీవీరపాండ్యన్, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రధాని పర్యటనలో లోటుపాట్లు తలెత్తకుండా అధికారులందరూ అప్రమత్తతతో మెలగాలని మంత్రులు సూచించారు. భద్రతాపరంగా ఎటువంటి సమస్య తలెత్తినా సరిదిద్దడానికి ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, సత్యసాయి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, కలెక్టర్, ఎమ్మెల్యే పల్లె సింధూర

సోషలిజమే అసలైన ప్రత్యామ్నాయం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

కదిరి అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సమానత్వం, సమ సమాజం.. సోషలిజం లక్ష్యాలని, దోపిడీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిజం అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. 'అక్టోబరు విప్లవం.. విశిష్టత' అనే అంశంపై పట్టణంలో సోమవారం జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. అంతకు మునుపు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, 1917లో సంభవించిన మహత్తర రష్యన్ విప్లవం ఒక మనిషిని మరో మనిషి, ఒక జాతిని మరో జాతి దోచుకునే సమాజం సోషలిస్టు వ్యవస్థకు బీజం వేసిందని అన్నారు. పాత సామాజిక విప్లవాలు మానవాళిని ఒక దోపిడీ వ్యవస్థ నుంచి మరో దోపిడీ వ్యవస్థకు నడిపిస్తే.. అక్టోబరు సోషలిస్టు విప్లవం దోపిడీని పూర్తిగా నిర్మూలించిందని అన్నారు. నేడు భారతదేశంలో మోదీ పాలన అసమానతలను పెంచేలా ఉందని విమర్శించారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను ప్రజలకు అందించడం లేదని, కార్మిక చట్టాలను సవరించి పెట్టుబడిదారులకు అనుకూల మార్గాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాంభూపాల్ అన్నారు. అక్టోబరు విప్లవం స్ఫూర్తితో రానున్న కాలంలో అన్ని రంగాలలో అసమానతలను తొలగించే విధంగా పెద్ద ఎత్తున ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు జి.ఓబులు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, కమిటీ సభ్యులు శ్రీనివాసులు, నరసింహులు, జంగాలపల్లి పెద్దన్న, నాయకులు ప్రవీణ్, సాంబశివ, రామ్మోహన్, బాబ్జాన్, బడా సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వణికించే చలి..!

పొద్దెక్కినా వీడని పొగమంచు

ప్రమాదకరంగా జాతీయ రహదారులు

మరింత పెరుగుతుందంటున్న నిపుణులు

ఉదయం 7 గంటకు.. 44వ జాతీయ రహదారి



చిలమత్తూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత పెరుగుతోంది. ఈ ఏడాది కాస్త ముందుగానే చలిపులి దాడి చేస్తోంది. శీతల గాలుల ప్రభావంతో వారం రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. ఉదయం 9 గంటలు దాటినా చలి తీవ్రత తగ్గడం లేదు. కర్ణాటక సరిహద్దులో ఉన్న చిలమత్తూరు మండలంలో ఉష్ణోగ్రతలు మరింత పడిపోతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల వర్షాలు బాగా కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఇప్పుడు చలికాలం ప్రారంభం కావడంతో మరింత వణుకు పుడుతోంది. సాయంత్రం 5 గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి.

రోడ్లను కమ్మేస్తున్న పొగ మంచు

చలికాలం మొదలవ్వగానే పొగ మంచు ప్రమాదకరంగా మారుతోంది. ఎప్పుడు తెల్లవారింతో తెలియనంతగా సూరీడును దాచేస్తోంది. ఉదయం 8 గంటల సమయంలో కూడా పది మీటర్ల దూరంలో ఉన్న వ్యక్తులు కనిపించడం లేదు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటల మధ్య మరింత విపరీతంగా పొగమంచు కురుస్తోంది. ప్రధానంగా 44వ, 544-ఈ జాతీయ రహదారులు పూర్తిగా పొగమంచుతో నిండిపోయి, ప్రమాదకరంగా మారుతున్నాయి. ముందు వెళుతున్న వాహనాలను గుర్తించడం డ్రైవర్లకు కష్టంగా మారుతోంది.

రైతులకు తిప్పలు..

ఉదయాన్నే పొలాల్లోకి వెళ్లి పనులు చేసుకునే రైతులకు పొంగ మంచుతో కష్టాలు తప్పడం లేదు. వ్యవసాయ పనులు చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 9 గంటలైనా పనులకు వెళ్లలేకపోతున్నారు. వర్షం కురిసినట్లు మంచు కురుస్తుండడంతో పొలాల్లోకి దిగలేకున్నారు. సాహసించి పనులకు వెళ్లేవారు దారిలోనే తడిసిపోతున్నారు. ఈ కారణంగా ఎండకాచిన తరువాతే పనులకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.

స్వెట్టర్లు.. దుప్పట్లకు గిరాకీ

చలితీవ్రత పెరుగుతుండటంతో స్వెట్టర్లు, రగ్గులకు ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. నిన్నమొన్నటి వరకు వెలవెలబోయిన దుకాణాలు ఇప్పుడు సందడిగా మారాయి. అన్ని వస్త్ర దుకాణాలు, రోడ్డు పక్కన తోపుడు బండ్లు, షెడ్లపై స్వెట్టర్లు, రగ్గులను పెద్ద ఎత్తున కొంటున్నారు. నిన్న మొన్నటి వరకూ ఒక ధర.. ఇప్పుడు మరో ధర అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. సీజన్ కావడంతో చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అవసరమైన స్వెట్టర్ల ధరలు రూ.250 నుంచి రూ.1500 వరకు పలుకుతున్నాయి.

చలి తీవ్రత పెరిగే అవకాశం

ఈ ఏడాది జూన్ నుంచి అడపాదడపా వర్షాలు పడుతూనే ఉన్నాయి. ఇటీవల వచ్చిన తుపానుల ప్రభావంతో వాతావరణంలో తేమ అధికంగా ఉంది. దీనికి తోడు బంగాళాఖాతంలో మార్పులతో ఈదురు గాలులు వీస్తున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. రాత్రి పూట పొగమంచు కురుస్తుండటంతో చలి తీవ్రంగా ఉంది. డిసెంబరు, జనవరి నెలల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. వృద్ధులు, పిల్లలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పురంలో పొలిటికల్ హీట్

రాద్ధాంతం చేస్తున్న వైసీపీ

ఇరు పార్టీల వారిలో కేసుల భయం

పరారీలో ఓ పార్టీ నాయకులు



15వ తేదీ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

హిందూపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఎన్నికల సమయంలో ఎక్కడైనా పొలిటికల్ హీట్ ఉంటుంది. హిందూపురంలో ఏ ఎన్నికలు లేకున్నా నాలుగు రోజులుగా రాజకీయంగా పురం హీట్ ఎక్కింది. ఇందుకు కారణం వైసీపీ సమన్వయకర్త దీపిక భర్త వేణురెడ్డి.. ఎమ్మెల్యే బాలకృష్ణపై చేసిన అనుచిత వ్యాఖ్యలే ప్రధాన కారణమనే చెప్పవచ్చు. గతంలో కూడా ఆయన ఎమ్మెల్యేపై, తెలుగుదేశం పార్టీపై ఎన్నో విమర్శలు చేశారు. అధికార పార్టీ పట్టించుకోలేదు. ఈ సారి ఎమ్మెల్యే పర్యటనకు వచ్చిన రోజే లేపాక్షి మండలంలో కోటి సంతకాల కార్యక్రమంలో వేణురెడ్డి.. ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో తెలుగు తమ్ముళ్లు ఒక్కసారిగా ఆగ్రహించారు. ఎలాగైనా వేణురెడ్డి వద్దకు వెళ్లి ఎమ్మెల్యేకి క్షమాపణ చెప్పించాలని భావించారు. దీంతో వారు పట్టణంలోని వైసీపీ కార్యాలయం వద్దకు వెళ్లగా.. అక్కడ వేణురెడ్డి లేకపోవడంతో అక్కడే ఉన్న వైసీపీ కార్యకర్తలు, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం తలెత్తింది. కార్యాలయంలోని అద్దాలు, ఫర్నీచర్‌ని ధ్వంసం చేశారు. దీంతో హిందూపురంలో పొలిటికల్ హీట్ ప్రారంభమైంది.

వైసీపీ రాద్ధాంతం

తమ పార్టీ కార్యాలయంపై టీడీపీ నాయకులు దాడి చేయడాన్ని వైసీపీ విపరీతమైన రద్దాంతం చేయడానికి పూనుకుంది. ఎంతగా అంటే హిందూపురం మొదలుకొని ఇచ్చాపురం వరకు నిరసనలు చేస్తున్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకవర్గ పర్యటనలో ఉండగా.. వైసీపీ నాయకులు ర్యాలీ చేయాలని ఉమ్మడి జిల్లా నేతలకు పిలుపునిచ్చారు. దీంతో పలువురు వైసీపీ నేతలు.. హిందూపురం వస్తుండగా దారిలోనే వారిని అడ్డుకున్నారు. ఎందుకంటే అప్పటికే దాడిచేసిన టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేశారు. దీంతో వైసీపీ నాయకులు హిందూపురం వచ్చి చేసేదేమీలేదని పోలీసులు వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. రాద్ధాంతం చేయడానికే వైసీపీ పూనుకుందని పోలీసులు భావించారు. అయినా వైసీపీ నాయకులు దాడి ఘటనపై సోషల్ మీడియాలో తీవ్రంగా స్పందించారు. వైసీపీ ఇన్‌చార్జి దీపిక, ఆమె భర్త వేణురెడ్డి, నియోజకవర్గ నాయకులు ఈ విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నారు. ఈ ఘటనను వైసీపీ ఇన్‌చార్జి తనకు అనుకూలంగా మలచుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గతంలో ఆ పార్టీ నుంచి ఇద్దరు ముఖ్యనేతలను సస్పెండ్ చేయించారు. ఎలాగైనా అధిష్ఠానం వద్ద తమ మార్క్ చూపించుకోవాలని తపన పడుతున్నారు. కలిసొచ్చిన ఈ ఘటనను అధిష్ఠానం వద్ద తమకు అనుకూలంగా మలుచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని సొంత పార్టీ నాయకులే అంటున్నారు.

వెంటాడుతున్న కేసుల భయం

ఈనెల 15న జరిగిన వైసీపీ కార్యాలయంపై దాడికి సంబంధించి గొడవ పెట్టుకోవాలని సూచించినందుకు కేసులు నమోదు చేశారు. దాడికి పాల్పడిన టీడీపీ కన్వీనర్లు వెంకటేష్, రాము, అభిలాష్‌తో పాటు మరికొంత మందిపై కేసులు నమోదు కాగా, వైసీపీలో దీపిక భర్త వేణురెడ్డితో పాటు మరికొందరిపై కేసు కట్టారు. వైసీపీ నాయకులు హిందూపురం వదిలి బెంగళూరు ప్రాంతానికి వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. ఏది ఏమైనా హిందూపురంలో పొలిటికల్ హీట్ కొనసాగుతుందనడంలో సందేహం లేదు.

రాప్తాడుకు బంగారు భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రేపు రైతుల ఖాతాల్లోకి సొమ్ము

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము విడుదల

7

మెరుగు పెడతామని బురిడీ

బంగారం చైను లాక్కెళ్లిన దుండగులు

అమ్మ నగలు తాకట్టుపెట్టి..!

6

లేపాక్షిలో రుద్రాభిషేకం



ఏడు శిరస్సుల నాగేంద్రుడి వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

లేపాక్షి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం, ఘనంగా నిర్వహించారు. వేద పండితులు దుర్గా వీరభద్రస్వాములను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయంలో ఏడు శిరస్సుల నాగేంద్రుడికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి సమర్పించిన చీరలను కమిటీ చైర్మన్ రమానందన్ భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సౌజన్య లక్ష్మీ, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

వైసీపీ ఐదేళ్లు ఇచ్చినంత ఏడాదిలోనే ఇచ్చాం

- ఎమ్మెల్యే బాలకృష్ణ
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్నవారితో ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇచ్చినంత సీఎం సహాయనిధిని ఏడాదిలోనే తమ ప్రభుత్వం ఇచ్చినట్లు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. తన కార్యాలయం వద్ద సోమవారం 39మందికి రూ.50లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలు అనారోగ్యంతో ఆసుపత్రిపాలై ఆర్థికంగా చితికిపోయి ఉంటారు. మరికొంతమంది ప్రమాదంలో గాయపడి ఆసుపత్రికి వెళ్లి ఆర్థిక స్తోమత లేక భూములు, ఇల్లు తాకట్టుపెట్టి ప్రాణాలు దక్కించుకుని ఉంటారు. అలాంటివారికి సీఎం సహాయనిధి గొప్పవరం అన్నారు. 16నెలల్లో సుమారు రూ.5కోట్లు సీఎంఆర్ఎఫ్ అందించామన్నారు. నియోజకవర్గంలో ఎవరైనా క్యాన్సర్ బారినపడితే వారు హైదరాబాద్ బసవతారకం ఆసుపత్రిలో రాయితీతో చికిత్స పొందవచ్చన్నారు. అనంతరం కిరికెర చౌడేశ్వరి గ్రామ సమాఖ్య భవనానికి 3సెంట్ల స్థలానికి సంబంధించిన పత్రాలు అందించారు. పోస్టల్ బీమా చెక్కులను బాధితులకు అందించారు.

సంబరాల సందడి..!



సత్యసాయిబాబా లేజర్ షో



తిలకిస్తున్న భక్తులు

(5వ పేజీ తరువాయి)

షెడ్యూల్, మినిట్ టు మినిట్ రూట్ మ్యాప్, భద్రత గురించి డీఐజీ షిమోషి, ఎస్పీ వివరించారు. వేడుకలు, ప్రముఖుల పర్యటనలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని అదనపు డీజీ ఆదేశించారు. స్టేడియం, సాయి కుల్వంతు హాలు వెలుపల ప్రతి ఒక్కరినీ తనిఖీ చేయాలని ఆదేశించారు. భక్తులతో మర్యాదగా నడుచుకోవాలని, సూచించారు. ఏ చిన్న సమస్య వచ్చినా కంట్రోల్ రూంకు సమాచారం అందచేయాలని సూచించారు.

నేడు డీఎంఈ రాక

అనంతపురం వైద్యం(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జయంతి వేడుకలను పురస్కరించుకుని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ రఘునందన్ మంగళవారం పుట్టపర్తి రానున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ఇతర ప్రముఖులు బుధవారం సత్యసాయి జయంతి వేడుకలకు రానున్న తరుణంలో ప్రత్యేక అత్యవసర వైద్యసేవల కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ వైద్య విద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఫోరెన్సిక్ హెచ్ఓడీ ప్రొఫెసర్ ఆర్.శంకర్ లైజనింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. ఇప్పటికే కళాశాల నుంచి వివిధ విభాగాల స్పెషల్ డాక్టర్లకు డ్యూటీలు కేటాయించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం నుంచి 23వరకు ప్రత్యేక అత్యవసర కేంద్ర సేవలు కొనసాగనున్నాయి. కాగా డీఎంఈ రఘునందన్‌తోపాటు అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వర్లు, స్టేట్ నోడల్ ఆఫీసర్ అనురాధ తదితరులు వేడుకలకు రానున్నట్లు లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ శంకర్ పేర్కొన్నారు.

వేడుకలు విశ్వవ్యాప్తం: రత్నాకర్



మాట్లాడుతున్న ఆర్‌జే రత్నాకర్

సత్యసాయి శత జయంతి వేడుకలకు దేశ విదేశాల నుంచి తరలివచ్చిన భక్తులతో పుట్టపర్తిలో కోలాహలం నెలకొందని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ అన్నారు. సత్యసాయి ప్రేమ, సందేశాలు విశ్వ వ్యాప్తంగా ప్రతిధ్వనిస్తున్నాయని అన్నారు. ప్రశాంతి నిలయం రేడియో సాయి వద్ద అఖిలభారత సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు నిమీష్ పాండేతో కలిసి సోమవారం మీడియాతో మాట్లాడారు. వేడుకలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారం, ఏర్పాట్ల గురించి వివరించారు. సెంట్రల్ ట్రస్ట్, సేవాసంస్థలు, సిబ్బంది, సాయి విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, కార్యకర్తల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. శత జయంతి ఉత్సవాలకు ఏడాది కాలంగా రూపకల్పన చేశామని, దేశవిదేశీ భక్తులు 220కిపైగా సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు వసతి, భోజనం, దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. రైల్వే స్టేషన్ నుంచి ప్రశాంతి నిలయం వరకూ దారులన్నీ విద్యుత్ కాంతులు పరుచుకున్నాయని తెలిపారు. సాయి భక్తులు స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు.

సీఎం చంద్రబాబు చొరవ..




రాష్ట్ర ప్రభుత్వం సత్యసాయి శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రభుత్వం, ట్రస్టు కలిసి ఘనంగా వేడుకలు జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ చూపించారని, అధికార యంత్రాంగాన్ని దించి పని చేయిస్తున్నారని అన్నారు. కేంద్రం ప్రభుత్వం 160 ప్రత్యేక రైళ్లు వేసిందని అన్నారు. ఈ నెల 19న ప్రధాని చేతుల మీదుగా సత్యసాయి శత జయంతి స్మారక చిహ్నంగా వంద రూపాయల నాణెం, నాలుగు తపాల స్టాంపులను ఆవిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాల్లో జిల్లాలో వంద మంది రైతులకు పాడి ఆవులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఏటా 18న జరిగే వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని సత్యసాయి రథోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సత్యసాయి శత జయంతి వేడుకలు భక్తులకే కాదని, సమస్త సృష్టి కోసం, మనుషులు, జంతువులు, ప్రకృతి, చెట్లు, పక్షులు అన్నింటికీ పరమ పవిత్రమైన పండుగ అని నిమీష్ పాండే అన్నారు.

నేడు పుట్టపర్తికి గవర్నర్

● ఉత్సవాల్లో పాల్గొననున్న డీసీఎం, మంత్రి లోకేశ్

పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాలోకేశ్ మంగళవారం పుట్టపర్తికి రానున్నారు. గవర్నర్ అబుల్ నజీర్ విజయవాడలో సాయంత్రం నాలుగు గంటలకు ప్రత్యేక విమానంలో బయల్దేరి 5.20 గంటలకు సత్యసాయి విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రికి శ్రీనివాస అతిథి గృహంలో బస చేస్తారు. బుధవారం ఉదయం 9.45కి ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి సత్యసాయి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతారు. అనంతరం సాయికుల్వంత్ హాలులో సత్యసాయి మహా సమాధిని దర్శించుకుంటారు. తర్వాత 10.30 హిల్‌వ్యూ స్టేడియంలో ప్రధానితోపాటు సత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం తిరుపతికి వెళ్తారు. డిప్యూటీ సీఎం సాయంత్రం 4 గంటలకు విజయవాడలో ప్రత్యేక విమానంలో బయలుదేరి సాయంత్రం 5 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రికి ప్రశాంతి నిలయంలోని శ్రీనివాస అతిథి గృహంలో విడిది చేస్తారు. ఐటీ శాఖ మంత్రి నారాలోకేశ్ మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో 3.40గంటలకు ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయల్దేరి పుట్టపర్తి విమానాశ్రయానికి 5.10కి చేరుకుంటారు. పుట్టపర్తిలో కప్పలబండ ఏపీఐఐసీ పార్కులో ఏర్పాటు చేసిన ప్రత్యేక విడిది కేంద్రంలో బసచేస్తారు. బుధవారం పుట్టపర్తి విమానాశ్రానికి చేరుకుంటారు. ప్రధాన మంత్రిని స్వాగతం పలుకుతారు. పది గంటలకు సాయికుల్వంత్ హాలోలో సత్యసాయిబాబా మహాసమాధిని దర్శించుకుంటారు. 10.30 హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహించే సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంటకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుని వెళ్తారు. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ మధ్యాహ్నం 12.45కి బెంగళూరు విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో పుట్టపర్తి చేరుకుని రాత్రికి పుట్టపర్తిలో బసచేస్తారు.



చలికి చెల్లు

సంక్షేమ హాస్టళ్లకు దుప్పట్లు, కార్పెట్ల సరఫరా

విద్యార్థుల ఆనందం



అనంతపురంలోని ఎస్సీ-2 బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ రామునాయక్

అనంతపురం విద్య, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చలి విపరీతంగా ఉంటోంది. రాత్రిళ్లు మంచు కురుస్తోంది. దీంతో జనం విలవిల్లాడుతున్నారు. ఇక, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. చలికి అల్లాడిపోతుంటారు. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం.. వారికి దుప్పట్లు, కార్పెట్లు సరఫరా చేసి, ఆదుకుంది. దీంతో విద్యార్థులు ఆనందపడుతున్నారు.

చకచకా పంపిణీ

గత వైసీపీ హయాంలో హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం పేదపిల్లలు చదువుతున్న హాస్టళ్లకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది. వైసీపీ హయాంలో చిన్న మరమ్మతులకు కూడా పైసా ఇచ్చేవారు కాదు. నెలనెలా మెస్‌బిల్లులు చెల్లించేవారుకాదు. ప్రస్తుతం హాస్టళ్ల మరమ్మతులకు ప్రత్యేకంగా రూ.లక్ష వరకు నిధులిచ్చారు. మెస్‌బిల్లులు పెండింగ్‌లేకుండా చెల్లిస్తున్నారు. ఈనేపథ్యంలో కొత్త దుప్పట్లు, కార్పెట్లను హాస్టళ్లకు సరఫరా చేశారు. జిల్లాకు వచ్చిన వాటిని హాస్టళ్లకు పంపారు. బీసీ హాస్టళ్లలో 5,400 మందికి, ఎస్సీ హాస్టళ్లలోని 5,267 మందికి, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని 600 మందికి, మైనార్టీ హాస్టళ్లలోని 425 మందికి దుప్పట్లు, కార్పెట్లు వచ్చాయి. వీటన్నింటిని ఆయా హాస్టళ్లకు చేర్చడంతో వార్డెన్లు చకాచకా విద్యార్థులకు పంపిణీ చేశారు.

ప్రతి విద్యార్థికి దుప్పటి, కార్పెట్ ఇచ్చాం



హాస్టళ్ల విద్యార్థులకు కొత్త దుప్పట్లు, కార్పెట్లను ప్రభుత్వం సరఫరా చేసింది. అవి జిల్లాకు రాగానే హాస్టళ్లకు సరఫరా చేయించాం. అక్కడ వార్డెన్లు.. విద్యార్థులకు పంపిణీ చేస్తారు. ప్రతి విద్యార్థికి ఈసారి కొత్త దుప్పటి, కార్పెట్ అందించాం. ఎక్కడా కొరత రాలేదు.

-కుష్బూకొఠారి,
బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల డీడీ

రాప్తాడుకు బంగారు భవిష్యత్తు

సీఎం చంద్రబాబు చొరవతోనే రేమండ్స్ రాక

ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రేమండ్స్ పరిశ్రమ రాకతో రాప్తాడు భవిష్యత్తుకు బంగారు బాటలు పడ్డాయని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. జాకీ పరిశ్రమ స్థానంలో రేమండ్స్ వస్త్ర పరిశ్రమ మంజూరు చేసిన నేపథ్యంలో సోమవారం రాప్తాడు సమీపంలో పరిశ్రమ ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞత సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజనప్ప, ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ థ్యాంకు సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో సీఎం చంద్రబాబు సహకారంతో రాప్తాడులో జాకీ పరిశ్రమ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. వైసీపీ ప్రభుత్వం దాన్ని విస్మరించిందన్నారు. అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, అతడి సోదరుల వసూళ్ల ప్రయత్నం కారణంగా జాకీ రాప్తాడును వదిలిపోయిందన్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రాగానే అదే కంపెనీ లేక ఇతర కంపెనీలను తీసుకొస్తామని ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశామన్నారు. ఆ మేరకు ప్రముఖ వస్త్ర కంపెనీ రేమండ్స్ రూ.497కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిందన్నారు. పరిశ్రమ ఏర్పాటైతే 4వేల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



థ్యాంక్యూ సీఎం సర్ పోస్టర్‌కు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్

తూకాల్లో తేడా..!

తక్కువ తూకంతో రేషన్ షాపులకు బస్తాల సరఫరా

బయటకు చెప్పుకోలేక పోతున్న డీలర్లు

కార్డుదారులపై ప్రభావం

అనంతపురంరూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రేషన్ తూకాల్లో కిరి.. కిరి చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి నెలా రేషన్ షాపులకు సరఫరా అయ్యే బస్తాల్లో రెండు నుంచి ఐదు కేజీల వరకు కోత పడుతున్నట్లు తెలుస్తోంది. గోదాముల నుంచే తక్కువ తూకంతో సరఫరా అవుతున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. దీంతో డీలర్లు బయటకు చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రభావం కాస్త కార్డుదారులపై పడుతోంది. కార్డుదారులకు రేషన్ పంపిణీలో కోత పెడుతున్నారు.

తక్కువ తూకంతో సరఫరా..

అనంతపురం రూరల్ మండలం, అర్బన్ పరిధిలో 220కిపైగా రేషన్ షాపులున్నాయి. వాటికి రాప్తాడు సమీపంలోని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ గోదాము నుంచి రేషన్ సరఫరా అవుతోంది. బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాల పరిధిలోని రేషన్ షాపులకు సైతం ఈ గోదాము నుంచి సరఫరా చేస్తున్నారు. ప్రతినెలా గోదాము నుంచి సరఫరా అయ్యే రేషన్ బస్తాల తూకం నానాటికీ తగ్గిపోతోందన్న వాదనలు సంబంధిత వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఒక్కో బస్తాలో 50 కేజీలు ఉండాలి. షాపులకు సరఫరా అవుతన్నా బస్తాల్లో మాత్రం భారీస్థాయిలో వ్యత్యాసం ఉంటోంది. ప్రతి నెలా రెండు నుంచి మూడు కేజీల చొప్పున తక్కువ తూకంతో బస్తాలు వస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కోతలు మరింత ఎక్కువైనట్లు సమాచారం. బస్తాలో ఏడెనిమిది కేజీల చొప్పున తక్కువగా వస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. దీంతో డీలర్లు తలలు పట్టుకుంటున్నారు.



నగరంలోని ఓ రేషన్ షాపునకు సరఫరా అయిన బస్తాలో తక్కువగా ఉన్న బియ్యం

కార్డుదారులపై ప్రభావం

రేషన్ తక్కువ తూకాల ప్రభావం కార్డుదారులపై పడుతోంది. రేషన్ షాపుల్లో డీలర్ల కోతలు సర్వసాధారణమైపోయింది. ప్రభుత్వం ఏదైనా డీలర్లు మాత్రం అదే వరఒడిని కొనసాగిస్తున్నారన్నది బహిరంగ రహస్యమే. గతంలో కార్డుదారులు 20కేజీలు తీసుకుంటే రెండు నుంచి మూడు కేజీలు తక్కువగా వచ్చేవి. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి నెలకొంది. గోదాముల నుంచే తక్కువ తూకంతో వస్తుండటంతో కార్డుదారులకు పంపిణీలో కోతలు పెడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు నోరు మెదపట్లేదు. గతంలో డీలర్లు.. గోదాముల వద్దకెళ్లి తూకాలు వేయించుకుని షాపులకు తెచ్చుకునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గోదాములకు వెళ్లి రేషన్ తెచ్చుకునే డీలర్లు తక్కువైపోయారంటున్నారు. గోదాములో ప్రశ్నించే, ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పేవారికి సక్రమంగా సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. రాగులు, జొన్నల సరఫరాలో ఇలాంటి వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి.



రాప్తాడు సమీపంలోని పౌరసరఫరాల గోదాము

గోదాముల వద్దకెళ్లి తెచ్చుకుంటే సమస్య ఉండదు

బియ్యం బస్తాలు తక్కువ తూకంతో వస్తున్నాయని మా దృష్టికొచ్చింది. కొందరు డీలర్లు బస్తాలను తూకం వేసి, ఫొటోలను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని గోదాములోని స్టాకిస్టుకు కూడా చెప్పాం. మొదటి నుంచి గోదాము వద్దకు వెళ్లి బస్తాలు తూకం వేసుకుని తెచ్చుకోవాలని డీలర్లకు చెబుతున్నాం. డీలర్లు మాత్రం అక్కడకు వెళ్లడం లేదు. దీంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

-బాషా, సీఎస్‌డీటీ, అనంతపురం అర్బన్, రూరల్ మండలం

ఎస్టీ కమిషన్ సభ్యుడిగా వెంకటప్ప ప్రమాణ స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటప్ప

అనంతపురం క్రైం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితుడైన వెంకటప్ప ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం విజయవాడలో ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యుల ప్రమాణస్వీకారం నిర్వహించారు. జిల్లాకు చెందిన వెంకటప్పను ఇటీవల కమిషన్ సభ్యుడిగా ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన.. చైర్మన్ బొజ్జిరెడ్డి, ఇతర సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనను జిల్లాకు చెందిన పలువురు నాయకులు, తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి వెంకటరామయ్య కలిసి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే

ఎస్టీ కమిషన్ సభ్యుడిగా ఎంపికైన వెంకటప్పకు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అభినందనలు తెలిపారు. కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి, ఇతర సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతపురం జిల్లాకు చెందిన వెంకటప్ప ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాయల్ మురళి, కృష్ణకుమార్, సాకే లక్ష్మీనరసింహ, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

అమ్మ నగలు తాకట్టుపెట్టి..

● 19ఏళ్లకే కిలిమంజారో పర్వతారోహణ
● దిగుమర్రి యువతి కుసుమ ప్రతిభ

నార్పల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏదైనా సాధించాలన్న తపన ఆ యువతిని కిలిమంజారో పర్వత శిఖరాలపైకి తీసుకెళ్లింది. పర్వతంలో రాళ్లు, గుండ్ల కంటే.. జీ వితంలోనే ఎక్కువగా కష్టాలను అధిగమించింది. నిరుపేద కుటుంబంలో పుట్టింది. కూలికెళ్తేనే కుటుంబం గ డుస్తుంది. అయినా.. పేదరికం.. లక్ష్య సాధనకు అడ్డుకాలేదు. అన్న ప్రోత్సహించాడు. అమ్మ బంగారాన్ని తాకట్టుపెట్టి.. ఆశయం దిశగా నడిపించింది. ఆఫ్రికా ఖండంలోనే అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి శభాష్ అనిపించుకుంది మండలంలోని దిగుమర్రి గ్రామానికి చెం దిన కుసుమ. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమే తన లక్ష్యమని చెబుతోంది.

నిరుపేద కుటుంబం

నార్పల మండలంలోని దిగుమర్రి గ్రామానికి చెందిన పెద్దన్న, నారాయణమ్మ దంపతులు కూలి పనులకు వెళ్తుంటారు. వారికి కుమారుడు కుళ్లాయప్ప, కుమార్తె కుసుమ సంతానం. కుళ్లాయప్ప హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. కుమార్తె అన్న వద్దే హైదరాబాద్‌లో ఉంటూ గీతం కాలేజీలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చదువుతోపాటు ఏదో ఒకటి సాధించాలని తపన పెంచుకుంది. కుసుమ లక్ష్యాన్ని తెలుసుకున్న అన్న కుళ్లాయప్ప హైదరాబాద్‌లో బసినేపల్లి శేఖర్ బాబు అకాడమీలో పర్వతారోహణపై రెండేళ్ల పాటు శిక్షణ ఇప్పించాడు. అనంతరం ఆఫ్రికా ఖండంలోని అత్యంత ఎత్తైన పర్వతం కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాలని కుసుమ నిశ్చయించుకుంది. అందుకు దాదాపు రూ.6 లక్షలు ఖర్చవుతుంది. అంత డబ్బు లేకపోవడంతో అమ్మ బంగారాన్ని ప్రైవేటు బ్యాంకులో తాకట్టు పెట్టి కుసుమకు రూ.6 లక్షలు సమకూర్చారు. ఆ డబ్బుతో కిలిమంజారో పర్వతారోహణకు కుసుమ బయల్దేరింది. ఆఫ్రికా ఖండంలోని టాంజానియా దేశంలోని ఈ శిఖరం సముద్ర మట్టానికి 5,895 మీటర్ల ఎత్తులో ఉంటుంది. దీనిని అధిరోహించడం కష్ట సాధ్యమైనదే. అయినా.. కుసుమ ముందడుగే వేసింది. ఈనెల 12వ తేదీన కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించింది. అక్కడ త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించింది. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కూడిన ఫ్లెక్సీని ఎగురవేసింది. ప్రస్తుతం హైదరాబాద్‌కు తిరిగొచ్చింది. కాస్త అస్వస్థతగా ఉండడంతో విశ్రాంతి తీసుకుంటున్నట్లు కుటుంబికులు తెలిపారు.



కిలిమంజారో పర్వతంపై కుసుమ

ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఎవరెస్టు అధిరోహిస్తా: కుసుమ

అన్న ప్రోత్సాహం, అమ్మ త్యాగం ఎనలేనివి. వారి కారణంగానే కిలిమంజారోను అధిరోహించాం. ఎవరెస్టు శిఖరం ఎక్కడమే నా లక్ష్యం. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే అధిరోహిస్తా.



తల్లిదండ్రులు, అన్నతో కుసుమ

క్రైం కార్నర్

వైద్యుడి మృతదేహం లభ్యం



కార్తీక్‌రెడ్డి మృతదేహం

బెళుగుప్ప, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద హంద్రీనీవా కాలువలో ఆదివారం సాయంత్రం గల్లంతైన వైద్యుడు కార్తీక్‌రెడ్డి శవమై తేలారు. ఘటనా స్థలానికి రెండు కిలోమీటర్ల దూరంలో మృతదేహం లభించింది. బెళుగుప్ప మండలం దుద్దేకుంటకు చెందిన వెంకటస్వామిరెడ్డి, శ్రీదేవి రైతు దంపతుల పెద్దకుమారుడు కార్తీక్‌రెడ్డి. బెళుగుప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా పనిచేస్తుండేవారు. ఆయన భార్య శ్రావణి కర్నూలులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం హంద్రీనీవా బ్రిడ్జిపై నుంచి ఈత కొట్టేందుకు కాలువలోకి దూకారు. నీటి ప్రవాహ వేగానికి కొట్టుకుపోతూ.. కాపాడాలంటూ చేతులెత్తి అరిచారు. ఒడ్డున కూర్చుని ఉన్న బంధువుల సమాచారంతో బ్యాటరీలు వేసుకుని పోలీసులు గాలించారు. సోమవారం బ్రిడ్జికి రెండు కిలోమీటర్ల దూరంలో మృతదేహం లభ్యమైంది. భార్య శ్రావణి బంధువులు, తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.



కాలువ గట్టున విలపిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

పుట్టిన రోజునే ఆత్మహత్య

- అపార్ట్‌మెంట్ పైనుంచి దూకిన బీటెక్ విద్యార్థి
- అక్కడికక్కడే మృతి

అనంతపురం క్రైం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన బీటెక్ విద్యార్థి చల్లా శ్రవణ్(18) పుట్టిన రోజునే ఆత్మహత్య చేసుకున్నాడు. తాము ఉంటున్న అపార్టుమెంట్‌లోని 5వ అంతస్తు నుంచీ దూకి ప్రాణం తీసుకున్నాడు. దీనిపై అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదుచేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బెలుగుప్ప మండలానికి చెందిన లక్ష్మీనరసింహులు కుటుంబం రాంనగర్‌లోని ఎస్ఎల్ఎన్ఎస్ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటోంది. ఇతడికి ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడైన చల్లా శ్రవణ్ బళ్లారిలోని బీబీటీఎం ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి ఏడాది చదువుతుండేవాడు. సోమవారం పుట్టినరోజు కావడంతో ఆదివారం ఇంటికి వచ్చాడు. ఆదివారం అర్ధరాత్రి దాటాక అపార్టుమెంట్ 5వ అంతస్తు నుంచీ దూకాడు. తల, ఇతర భాగాల్లో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అవమానభారంతో మహిళ..

బత్తలపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామానికి చెందిన ప్రమీల (45) సోమవారం అవమాన భారంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఉప్పర్లపల్లి గ్రామానికి చెందిన ముత్యాలు భార్య ప్రమీల అదే గ్రామానికి చెందిన వడ్డే నెట్టికంటికి ఐదేళ్ల కిందట రూ.20వేలు వడ్డీకి అప్పు ఇచ్చారు. రెండేళ్లుగా నెట్టికంటి వడ్డీ చెల్లించలేదు. ఈ విషయమై ఇద్దరి మధ్య వివాదం ఉంది. కాగా ప్రమీల తన పొలంలో పని చేయించుకున్నందుకు కూలీలకు ఇవ్వమని తన బంధువైన పెద్దక్కకు ఆదివారం కూలి డబ్బులు ఇచ్చింది. అయితే పెద్దక్క కూలీలకు డబ్బులు ఇవ్వలేదు. ఈ విషయం తెలుసుకున్న ప్రమీల పెద్దక్కను మందలించింది. ఇది విన్న నెట్టికంటి కోడలు హేమ తమనే తిడుతోందని భావించి తమ బంధువులైన ఆదిలక్ష్మి, సుంకన్నతో కలిసి ప్రమీలతో గొడవపడింది. ఈక్రమంలోనే సుంకన్న ప్రమీలపై చేయి చేసుకున్నాడు. అంతటితో ఆగని హేమ బత్తలపల్లిలో ఉన్న వాళ్ల అమ్మకు ఫోన్ చేసి, మరో ఇద్దరిని పిలిపించి మరోసారి ప్రమీలపై దాడి చేయించింది. దీన్ని అవమానంగా భావించిన ప్రమీల తీవ్రంగా కుంగిపోయింది. ఈ క్రమంలోనే సోమవారం తెల్లవారుజామున ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుంది. ఉరికి వేలాడుతున్న ప్రమీలను ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కలవారి సాయంతో కిందకు దించి చూడగా మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. సీఐ రెడ్డప్ప గ్రామానికి వెళ్లి మృతికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ విషయమై కొడుకు సంజీవరాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హేమ, ఆదిలక్ష్మి, సుక్కన్న, ఓసురప్ప, రామాంజనమ్మల కేసు నమోదు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి కార్యాలయ ఇన్‌చార్జు హరీష్‌బాబు, బీజేపీ నాయకులు వీరనారప్ప గ్రామానికి చేరుకొని ప్రమీల మృతదేహానికి నివాళులర్పించారు.

పెళ్లి కాలేదని యువకుడు..

శెట్టూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): పెళ్లి కాలేదన్న మనస్తాపంతో మండలంలోని ఐదుకల్లు గ్రామానికి చెందిన కమ్మర నాగరాజు కుమారుడు కమ్మర హనుమంతరాయుడు (26) ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. ఎన్ని సంబంధాలు చూసినా వివాహం కుదరకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ సమీపంలోని కరణం రాజశేఖర్ పొలం వద్ద చింతచెట్టుకు చీరతో ఉరేసుకుని, మరణించాడు. అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబికులు గ్రామంలో వెతికినా ప్రయోజనం లేదు. సోమవారం ఉదయం రాజశేఖర్ పొలం వైపు వెళ్లిన గ్రామస్థులు హనుమంతురాయుడు ఉరికి వేలాడుతుండడాన్ని చూసి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. అతడి తల్లి తిప్పమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపుర ంరూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 46టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

రమా.. నీవు లేకుండా ఎలా బతికేది..?

- భార్య మృతదేహంపై పడి రోదించిన భర్త
- ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన లారీ
- మహిళ మృతి.. ముగ్గురికి గాయాలు



రమాదేవి (ఫైల్)

గార్లదిన్నె/శింగనమల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 'రమా.. అప్పుడే నన్ను వదిలి పోతివా..? నాకు పని చేతకాదు. మన బిడ్డను ఎలా సాకాలి? ఎలా బతకాలి?' అంటూ భార్య మృతదేహంపై పడి దివ్యాంగుడైన భర్త రోదించిన తీరు కంటతడి పెట్టించింది. ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టడంతో ఓ మహిళ మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడిన సంఘటన సోమవారం తిమ్మంపేట వద్ద 44వ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు శింగనమలకు చెందిన దివ్యాంగుడైన చిన్న పోతన్న, రమాదేవి(35) దంపతులు శింగనమలలో కూలి పనులు చేసుకుని జీవించేవారు. గ్రామంలో పనులు లేక పోవడంతో కొన్ని నెలలు కిందట రమాదేవి పుట్టినిల్లు అయిన పామిడికి వలస వెళ్లారు. అయితే వారికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయడం, సదరం సర్టిఫికెట్ పనుల కోసం సోమవారం చిన్నపోతన్న, రమాదేవి తమ కుమారుడు సాంబశివను తీసుకుని తమ బంధువైన చంద్రశేఖర్‌తో కలిసి స్కూటీలో శింగనమలకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి పామిడికి స్కూటీలో బయల్దేరారు. తిమ్మంపేట వద్ద 44వ జాతీయ రహదారిపై వీరి స్కూటీని బెంగళూరు నుంచి ద్విచక్ర వాహనాల లోడుతో మధ్యప్రదేశ్‌కు వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీలో ప్రయాణిస్తున్న రమాదేవి అక్కడికక్కడే మృతి చెందగా చిన్న పోతన్న, కుమారుడు శివ, బంధువు శేఖర్ గాయపడ్డారు. రెప్పపాటులో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన భార్య మృతదేహంపై పడి చిన్న పోతన్న కన్నీరుమున్నీరుగా రోదించాడు. ఎస్ఐ మహహ్మద్‌గౌస్ బాషా, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. క్షతగాత్రులను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ కల్లూరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఉండగా పోలీసులు పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వాహనాన్ని స్టేషన్‌కు తీసుకెళ్లారు.



భార్య మృతదేహంపై పడి ఏడుస్తున్న చిన్న పోతన్న

అంత్యక్రియలకు వెళుతుండగా..

- ఆటో బోల్తా, ఒకరి మృతి, కొందరికి గాయాలు



ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడిన ఆటోలోని సీటు

ఉరవకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బంధువుల అంత్యక్రియలకు వెళ్తూ, ఆటో బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. పామిడి మండలం, రామగిరి గ్రామానికి చెందిన తిరుపతయ్య(55) వజ్రకరూరు మండలం హోతూరులో తమ సమీప బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు వెళ్లేందుకు ఉరవకొండ నుంచి వెళ్తున్న ప్రయాణికుల ఆటో ఎక్కాడు. అయితే చిన్నహోతూరు సమీపంలోని హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ కాలువ వద్ద అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న తిరుపతయ్య, మారుతి, రామకృష్ణ, సావిత్రమ్మ, వసుంధర, మాలింగమ్మ, వన్నమ్మలతో పాటు మరికొంత మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఉరవకొండ ప్రభుత్వాసుపత్రి, గుంతకల్లులోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. తిరుపతయ్యకు తీవ్ర గాయాలు కాగా, అతన్ని గుంతకల్లులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెం దాడు. తీవ్రంగా గాయపడిన మారుతి, రామకృష్ణ, సావిత్రమ్మ హో తూరు గ్రామానికి చెందిన వారు కాగా, వసుంధర, మాలింగమ్మ, వ న్నమ్మలు కర్ణాటకలో కూలి పనులకు వలస వెళ్లి అంత్యక్రియల్లో పా ల్గొనేందుకు వచ్చి గాయపడ్డారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ నాగస్వామి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెంగళూరు రహదారిలో పాపిరెడ్డిపల్లి వద్ద సోమవారం కారు ఢీకొని శంకర్‌నాయక్ అలియాస్ గోప్యానాయక్ (74) సోమవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ షెక్షావలీ తెలిపారు. బూదిలి ప్రాంతానికి చెందిన శంకర్‌నాయక్ పుట్టపర్తి- బెంగళూరు రహదారిలో వడ్లకళ్లం చేస్తు, సోమవారం తెల్లవారుజామున చలిమంట వేసుకోవడానికి రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. గోరంట్ల మండలంలోని పెరుమాళ్లపల్లికి చెందిన ఉమాశంకర్ బెంగళూరు నుంచి కారులో వస్తూ రోడ్డు దాటుతున్న శంకర్‌నాయక్‌ను ఢీకొట్టాడు. దీంతో శంకర్‌నాయక్ మృతి చెందాడు. మృతుడి కుమారై రేఖాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

- ఇదే రహదారిలో ఆదివారం రాత్రి ద్విచక్ర వాహన ప్రమాదం జరిగింది. చిలమత్తూరు మండలం బీదిరెడ్డిపల్లికి చెందిన తల్లీకుమారుడు లక్ష్మీదేవమ్మ, అమరనాథ్‌రెడ్డి ద్విచక్రవాహనంలో వెళ్తూ రోడ్డు పక్కన ఆపి ఉన్న ట్యాంకర్ లారీని ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీ ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ పరిధిలో సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో నిర్వహించిన బీఫార్మసీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. సోమవారం వర్సిటీలోని పరీక్షల విభాగంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్‌నాయుడు తదితరులు ఫలితాలను విడుదల చేశారు. బీఫార్మసీ మొదటి, రెండో సెమిస్టర్ల రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, ఫస్టియర్ రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ, మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఫలితాలను జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌లో విద్యార్థులు చూసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య శివకుమార్, ఆచార్య శంకర్‌శేఖర్‌రాజు, డా.శ్రీధర్, అంకారావు పాల్గొన్నారు.

మిట్స్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్‌కి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన అధ్యాపకుడు మారుతీప్రసాద్

కురబలకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని అంగళ్లు సమీపంలో ఉన్న డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీకి చెందిన సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్, అధ్యాపకుడు మారుతీప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారని వీసీ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మారుతీప్రసాద్ తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో 'యాన్ ఇంటలిజెంట్ మల్టీమోడల్ సెక్యూరిటీ ఫ్రేమ్ వర్ ఎమర్జింగ్ అప్లికేషన్స్ యూజింగ్ ఐవోటీ' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను మిట్స్ యూనివర్శిటీ చాన్సలర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ప్రో చాన్సలర్ ద్వారకనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి తదితరులు అభినందించారు.

గుట్కా స్వాధీనం



సీజ్ చేసిన సరుకుతో అధికారులు

అనంతపురం క్రైం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): గుట్కాను అక్రమంగా బ్యాగుల్లో తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు సీజ్ చే శారు. సోమవారం ఏకంగా రూ.31.20 లక్షల విలువైన పాన్ మ సాలా, గుట్కా స్వాధీనం చేసుకున్నారు. రాబడిన సమాచారం మే రకు విజిలెన్స్ జీఎస్టీ అధికారులు రుద్రంపేట సమీపంలోని డీమార్ట్ వద్ద 44వ జాతీయ రహదారిపై తనిఖీలు చేశారు. వ్యాన్‌లో కర్ణాటక నుంచి తెలంగాణకు అక్రమంగా 120 గన్నీ బ్యాగుల్లో తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. లక్షలాది విలువైన ఈ సరుకును అధికారులు వాణిజ్య పన్నుల అధికారులకు స్వాధీనపరిచారు. తనిఖీల్లో సీఐ జమాల్‌బాషా, అధికారులు రాకేష్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు నమోదు చేయించండి

- డీడీ కుష్బూకొఠారి

అనంతపురం విద్య, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో చదివే ఎస్సీ ఉపకులాల విద్యార్థులకు ఉపకార వేతనాలకు సంబంధించి 2025-26 విద్యా సంవత్సరానికి ఫ్రెష్‌గా నమోదు చేయించాలని ఎస్సీ వెల్ఫేర్ ఇన్‌చార్జ్ డీడీ కుష్బూకొఠారి ప్రిన్సిపాళ్లను సోమవారం ఓప్రకటనలో కోరారు. ఇందు కోసం జ్ఞాన భూమి-వీ.2వెబ్‌పోర్టల్ కళాశాలల ప్రిన్సిపాళ్ల లాగిన్‌లో దరఖాస్తులు పొందుపరచినట్లు తెలిపారు. ఈ దరఖాస్తు నమోదు ప్రక్రియ సంబంధిత యూనివర్సిటీ అకడమిక్ క్యాలండర్ ఇయర్ ప్రారంభం నుంచి మూడు నెలలు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు అర్హులైన విద్యార్థులందరి రెన్యువల్, ఫ్రెష్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆమె సూచించారు.

కళ్యాణదుర్గం ఈ-స్టాంప్ అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించండి

- హైకోర్టులో పిల్

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గంలో ఈ-స్టాంప్ అక్రమాలపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. అనంతపురం వైసీపీ మాజీ ఎంపీ తలారి రంగయ్య ఈ పిల్ వేశారు. కళ్యాణదుర్గంలో బోయ యర్రప్ప, ఆయన భార్య భార్గవి ఈ-సేవా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అక్కడ నుండి తక్కువ విలువ చేసే ఈ-స్టాంపులను కొనుగోలు చేసి ఎక్కువ విలువగల స్టాంపులుగా మర్చి కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధీనంలోని ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోట్ల రూపాయాల ఆర్థిక లావాదేవీలను నిర్వహించిందన్నారు. కంపెనీకి చెందిన ఆర్థిక లావాదేవీలు, లోన్ దస్త్రాల పై లోతైన విచారణ జరిపించాలని కోరారు.

బంగారం చైను లాక్కెళ్లిన దుండగులు

చిలమత్తూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మెరుగు పేరుతో ఓ మహిళ మెడలో బంగారం చైను లాక్కుపోయిన సంఘటన మండలంలోని మరవకొత్తపల్లిలో సోమవారం జరిగింది. బాధితురాలు సుశీలమ్మ తెలిపిన ప్రకారం ఇద్దరు వ్యక్తులు వచ్చి ఇంట్లో ఉన్న పాత వెండి, ఇత్తడి వస్తువులకు మెరుగుపెడతామని చెప్పారన్నారు. దీంతో తాను వారిని ఇంటి వద్దకు పిలిచి ఇంట్లో ఉన్న ఇత్తడి కలశం, ఇతర పూజ సామగ్రి వస్తువులు ఇచ్చినట్లు తెలిపారు. మరికొన్ని వస్తువులను తీసుకురావడానికి ఇంట్లోకి వెళుతుండగా ఆ ఇద్దరి వ్యక్తుల్లో ఒక వ్యక్తి వెంబడించి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు చైనును లాగేసుకున్నాడన్నారు. ఇంటి బయట అప్పటికే ద్విచక్రవాహనంలో సిద్ధంగా ఉన్న వ్యక్తి దాన్ని ఎక్కి పారిపోయాడు. ఈ హఠాత్పరిణామం నుంచి తేరుకున్న ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చి దుండగుల కోసం వెంబడించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. అక్కడ ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ బాబు తెలిపారు.

రైల్వే ఉద్యోగులకు పురస్కారాలు

గుంతకల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రైలింజన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడగా అప్రమత్తమై అగ్ని ప్రమాదం జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించిన ఇద్దరు రైల్వే ఉద్యోగులకు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అభినందించి, ప్రశంసా పురస్కారాలను అందజేశారు. గుంతకల్లు నుంచి తిరుపతికి వెళ్తున్న రైలులోని ఇంజిన్‌లో పైన ఉండే హైటెన్షన్ కంపార్టుమెంట్‌లోని సేఫ్టీ ఎక్విప్‌మెంట్ అయిన కెపాసిటర్ డంపింగ్ ప్యానెల్ వేడెక్కిపోయి ప్రమాదకరంగా మారిన విషయాన్ని చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్ శబరినాథన్ గుర్తించారు. లోకో పైలెట్ అబ్దుల్ రవూఫ్‌కు తెలపడంతో ఆయన అప్రమత్తమై అగ్ని ప్రమాదం ఏర్పడకుండా రైలును జాగ్రత్తగా నడిపారు. సురక్షితంగా తిరుపతికి చేర్చగా అక్కడ రైలింజన్‌కు మరమ్మతులు చేశారు. రైలింజన్‌లో అగ్ని ప్రమాదం ఏర్పడకుండా అప్రమత్తంగా వ్యవహరించి, విధి నిర్వహణలో నిబద్ధతను చాటిన కారణంగా ఈ ఇద్దరు ఉద్యోగులను సోమవారం స్థానిక డీఆర్ఎం కార్యాలయానికి రప్పించారు. డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా.. చీఫ్ లోకో ఇన్స్‌పెక్టర్ శబరినాథన్‌కు, లోకోపైలెట్ అబ్దుల్ రవూఫ్‌కు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్ పాల్గొన్నారు.



లోకో పైలెట్ అబ్దుల్ రవూఫ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

రేపు రైతుల ఖాతాల్లోకి సొమ్ము

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము విడుదల

అనంతపురం అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్మును ఈనెల 19వ తేదీన విడుదల చేయనున్నారు. సీఎం చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ సొమ్ము, కేంద్రంలో ప్రధాని మోదీ పీఎం కిసాన్ సొమ్మును విడుదల చేయనున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి అధికారికంగా సమాచారం అందింది. జిల్లాలోని 2,75,642 మంది రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము రూ.137.82 కోట్లు, పీఎం కిసాన్ సొమ్ము రూ.51.10 కోట్లు మొత్తం రూ.188.92 కోట్లు జమ చేయనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని 2,65,040 మంది రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము రూ.132.52 కోట్లు, పీఎం కిసాన్ నిధులు రూ.46.24 కోట్లు మొత్తం రూ.178.76 కోట్లు విడుదల చేయనున్నారు. ఏడాదిలో మూడు విడతలుగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము జమ చేయాలని నిర్ణయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.14 వేలు, కేంద్రం నుంచి రూ.6వేలు జమ చేయనున్నారు. ఈ ఏడాది ఆగస్టు 2వ తేదీన తొలి విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్రం రూ.2వేలు చొప్పున జమ చేశాయి. ఈనెల 19వ తేదీన రెండో విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్రం రూ.2వేలు జమ చేయనుంది. మిగిలిన సొమ్మును మూడో విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.4వేలు, కేంద్రం రూ.2వేలు జమ చేయనున్నాయి.

అనంతపురం బాలికల జట్టుకు ప్రథమ స్థానం



కబడ్డీ విజేతగా నిలిచిన అనంతపురం బాలికల జట్టు

వినుకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా వినుకొండ జూనియర్ కాలేజీ ఆవరణలో జరుగుతున్న కబడ్డీ పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్స్ పోటీల్లో బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు నెల్లూరు జిల్లా జట్టుపై విజయం సాధించి ప్రథమ స్థానం సాధించారు. నెల్లూరు బాలికల జట్టు ద్వితీయస్థానం సాధించింది. బాలుర విభాగంలో గుంటూరు బాలుర జట్టు కడప బాలుర జట్టుపై విజయం సాధించి గుంటూరు జట్టు ప్రథమస్థానం, కడప జట్టు ద్వితీయ స్థానం సాధించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కౌన్సిలర్ షకీలా దస్తగిరి తదితరులు పాల్గొని ఆటలను తిలకించి విజేతలకు బహుమతులు అందజేశారు.

సమస్యలను పరిష్కరించాలి

- లోకో రన్నింగ్ స్టాఫ్ డిమాండ్



ఆందోళన చేస్తున్న లోకో రన్నింగ్ స్టాఫ్

గుంతకల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైల్వే మజ్దూర్ యూనియన్ లోకో రన్నింగ్ స్టాఫ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సోమవారం ఉదయం రైల్వే స్టేషన్‌లోని క్రూ కంట్రోల్ లాబీ వద్దకు చేరుకున్న లోకో రన్నింగ్ స్టాఫ్ ఆందోళనకు దిగారు. యూనియన్ ఎల్ఆర్ఎస్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ఎం బాషా మాట్లాడుతూ.. రన్నింగ్ అలవెన్స్ పెంచాలనీ, టీఏ తరహాలో కిలోమీటర్ అలవెన్సుకు కూడా ఐటీ మినహాయింపు ఇవ్వాలనీ, రన్నింగ్ స్టాఫ్ ప్రతి ప్రమోషన్‌కు గ్రేడ్ పేను పెంచాలనీ, సైకో టెస్ట్‌లో ఫెయిలైన సిబ్బందికి పే ఎలిమెంట్ ఇవ్వకపోవడాన్ని ఉపసంహరించాలనీ, హెడ్ క్వార్టర్స్ బైపాసింగ్ విధానం వద్దనీ, 72 గంటల పని విధానాన్ని తొలగించాలనీ, డబుల్ కాల్ సిస్టంను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లోకో రన్నింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టీల నిర్వాహకురాలిపై దాడి

- ఇంటి ముందు ధర్నా



ధర్నా చేస్తున్న బాధితులు

గుంతకల్లుటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చిట్టీల డబ్బు ఇవ్వలేదంటూ సోమవారం సాయంత్రం ఓ మహిళ, ఆమె తండ్రి కళ్లలో కారం వేసి విచక్షణారహితంగా దాడి చేశారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ధర్మవరం గేట్ రోడ్డులో నివాసముంటున్న దిల్షాద్ బేగం ఫొటో స్టూడియో నడుపుతూ చిట్టీలు నిర్వహిస్తోంది. చిట్టీల డబ్బు ఇవ్వకుండా మోసం చేసి.. తమపైనే కేసులు పెడుతోందంటూ బాధితులు.. పర్వీన్, కౌసర్, షాకీరా, అరుణమ్మ తదితరులు దిల్షాద్ బేగం ఇంటిపై సోమవారం దాడి చేశారు. ఆమెను రోడ్డుపైకి ఈడ్చుకొచ్చి, కళ్లలో కారం కొట్టి, దాడి చేశారు. ఆమె ఇంటి ముందు రోడ్డుపై బైఠాయించి, తమకు న్యాయం చేయాలని కోరారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ధర్నా విరమించాలని నచ్చజెప్పారు. చిట్టీల డబ్బు ఇచ్చేవరకు ధర్నా విరమించేది లేదని వారు భీష్మించారు. గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. దిల్షాద్‌బేగం, ఆమె తండ్రిని పోలీసులు ఆటోలో స్టేషన్‌కు తరలించారు. బాధితులు కూడా వెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.

టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం టామోటాలు కిలో గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.24తో, సరసరిగా రూ.30తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1950 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

న్యూస్ బాక్స్

ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య

● ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్



పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ధర్మవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వనితావాణి తెలిపారు. మండ లంలోని పోతుకుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం 'ప్రభుత్వ కళాశాలలో చేరండి - నాణ్యమైన విద్యను పొందండి' అనే కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వనితావాణి, అధ్యాపకులు సునీత, వనతి, తాజ్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, ప్రభుత్వం కూడా ప్రతి విద్యార్థికి పలు పథకాలు, సౌకర్యాలు అందిస్తోందని తెలిపారు. కావున పదో తరగతి ఉత్తీర్ణులైన తరువాత తమ కళాశాలలో చేరాలని వారు అవగాహన కల్పించారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం



ధర్మవరంలో రచయితలు, కవులను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం/ నంబులపూలకుంట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ అధికారి అంజలిసౌభాగ్యవతి ఆధ్వర్యంలో కవి సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కవి ప్రఫుల్లా చంద్ర, వెంకటేశులు, టీటీడీ ధర్మచారులు కకాకుమాను, రవీంద్ర, గాయకులు నాగరాజులను శాలువాతో ఘనంగా సత్కరించారు. గ్రంథాలయాల గురించి పద్యం, కవిత, పాటల ద్వారా వారు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాము, రమణనాయక్, గంగాధర్, సరస్వతమ్మ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే నంబుల పూలకుంటలోనిగ్రంథాలయంలో పుస్తకం విలువ - గ్రంథాలయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి హాజరయ్యారు. చిరిగిన చొక్కా వేసుకున్నా ఫర్వాలేదుకానీ, ఓ మంచి పుస్తకాన్ని కొనుక్కుని చదవాలి అని సూచించారు. గ్రంథాలయ అధికారి ఫరియాబాను, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓల మండల కమిటీ ఎంపిక



నూతన అధ్యక్షుడిని సత్కరిస్తున్న వీఆర్‌ఓలు

నల్లమాడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారుల నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కమిటీ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షురాలిగా శారదబాయి, కార్యదర్శిగా గంగాద్రి, కోశాధికారిగా సోమశేఖర్, సంయుక్త కార్యదర్శిగా సంజీవులను ఎంపిక చేసినట్లు నూతన కమిటీ అధ్యక్షుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. తన ఎంపికకు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు ఉలవల పంపిణీ

అమడగూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ కేంద్రం నందు బీజేపీ రాష్ట్ర ఆర్గానిక్ సెల్ కన్వీనర్ శరత్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం ఏట వెంకట రమణాచారి రైతులకు సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో ని రైతులను కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోందని తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు 10 కిలోల ఉలవల బ్యాగులను సుమారు 900 పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వేమనారాయణ, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోధనా సామర్థ్యం మెరుగుపడాలి: ఎంఈఓ

ధర్మవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని మెరుగు పరచుకోవాలని, అందుకు టీచ్ టూల్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ఎంఈఓ-2 గోపాల్‌నాయక్ తెలిపారు. సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధ్యాయులకు టీచ్ టూల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా పట్టణం లోని కొత్తపేట మున్సిపల్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఈ కార్యక్రమాన్ని సోమవారం నిర్వ హించారు. ఎంఈఓ మాట్లాడు తూ... ఉపాధ్యాయుల బోధన విద్యార్థులకు సక్రమంగా అందు తోందా లేదా అని తెలుసుకునేందుకు కోసం టీచ్ టూల్ కార్యక్రమం చక్కగా ఉపయోగ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణంలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు రాంప్రసాద్, సుమన, జగదీశ్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి పూర్వ విద్యార్థుల సన్మానం



ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఓబుళదేవరచెరువు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకమర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు కె.కృష్ణానాయక్‌ను సోమవారం ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. గతంలో ఆయన చెప్పిన పాఠాల వల్లే తాము ఉన్నత స్థాయికి ఎదిగామని, అందుకు గాను ఆయనను దుశ్శాలువతో ఘనంగా సన్మానించినట్లు వారు తెలిపారు. పూర్వ విద్యార్థులు పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ డిపో అధ్యక్షుడు జొలీ మహమ్మద్ రఫీక్, గంగాద్రి, వేణుగోపాల్, మహమ్మద్ ఆజాం, మహబూబ్ బాషా, బాబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.



సంగమేశ్వరాలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న కలెక్టర్





ప్రత్యేక అలంకరణలో కోన మల్లేశ్వరుడు, దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక సోమవారం పూజలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని తాడిమర్రి మండల సరిహద్దులోని కోన మల్లేశ్వర క్షేత్రంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా పార్నపల్లి నుంచి ఉత్సవ విగ్రహాలను కోన మల్లేశ్వర క్షేత్రానికి తీసుకొచ్చి పూజలు చేశారు. తిరిగి రాత్రి 9గంటల సమయంలో పార్నపల్లిలోని ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. అదేవిధంగా ధర్మవరంరూరల్ మండలంలోని కుణుతూరులో వెలసిన పురాతన చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు, ధర్మవరం పట్టణవాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే గాండ్లపెంటలోని శివాలయం, అయ్యప్పస్వామి ఆలయాల్లో, నల్లచెరువులోని మార్కండేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి దీపాలు వెలిగించారు. ఆయా ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



నల్లచెరువులో పూజల్లో పాల్గొన్న భక్తులు



గాండ్లపెంట శివాలయంలో...



కుణుతూరు చంద్రమౌళీశ్వరుడు

ప్రారంభానికి నోచుకోని మార్కెట్‌యార్డు

● పనులు పూర్తయినా నిరుపయోగమే..



ప్రారంభం కాని మార్కెట్‌యార్డు భవనం

నల్లమాడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటలను విక్రయించడానికి అనుకూలంగా ఉండడాలని గత ప్రభుత్వం మార్కెట్‌యార్డులను ఏర్పాటు చేసింది. మండలం లోని అరవవాండ్లపల్లి వద్ద వ్యవసాయ మార్కెట్ యార్డు భవనాన్ని రూ.3.82 కోట్లు నిధులు వెచ్చించి నిర్మాణం పూర్తి చేశారు. భవనం పూర్తి అయి నాలుగు సంవత్సరాలు పైబడింది. దాదాపు 14 ఎకరాల్లో భూవిని చదునుచేసి మొదటి విడతగా భవనం నిర్మించారు. అయినా ప్రస్తుతం నల్లమాడ మార్కెట్ యార్డును కొత్తచెరువులోనే నిర్వహిస్తున్నారు. నల్లమాడ మండలంలో నిర్మించిన మార్కెట్‌యార్డును ప్రారంభిస్తే నల్లమాడతోపాటు, ఓడీసీ, అమడగూరు మండలాల రైతులకు ఎంతో అనుకూలంగా ఉంటుందని రైతులు అంటున్నారు. స్థానికంగా మార్కెట్‌యార్డు నిర్మించినా ప్రారంభించకపోవడంతో రైతులు పండించిన పంటలను విక్రయించడానికి సుదూర ప్రాంతాలకు అద్దెవాహనాల్లో తీసుకెళ్లే దుస్థితి ఏర్పడింది. నల్లమాడలోనే మార్కెట్‌యార్డు ఏర్పాటు చేస్తున్నారని, ఈ ప్రాంతంలో పండించిన పంటలను ఇక్కడే విక్రయిం చుకోవచ్చని రైతులు సంతోషపడ్డారు. అయితే వారి ఆశలు అడియాశలయ్యాయి. ఈ ప్రాంత రైతులు పంటలను పండించి దూర ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు రవాణా ఖర్చులతో పాటు, అక్కడ మార్కెట్‌యార్డుల్లో కమిషన్లు ఇచ్చేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో పండించిన పంటల ద్వారా తమకు ఏమాత్రం గిట్టుబాటు కావడంలేదని రైతులు వాపోతు న్నారు. నల్లమాడ, పుట్టపర్తి ప్రధాన రహదారి పక్కనే ఉన్న మండలంలోని అరవాండ్లపల్లి సమీపంలోని గుట్టలో మార్కెట్‌యార్డు భవనం నిర్మించారు. ప్రారంభానికి నోచుకోలేదు. పైగా అక్కడ జనసంచారం తక్కువగా ఉండడంతో వాహనదారులు అసాంఘిక కర్యకలాపాలకు అనుకూలంగా ఉందని ప్రజలు అంటున్నారు. అక్కడ మద్యం తాగడంతోపాటు పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రజలు విమర్శిస్తున్నారు. మార్కెట్‌యార్డును గత వైసీపీ పాలనలో నిర్మించినా, దాన్ని ప్రారంభించకుండా అప్పుడు నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడైనా అధికారులు, పాలకులు స్పందించి మార్కెట్‌యార్డును ప్రారంభిస్తే తమకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, జిల్లా అధికారులతో కలిసి గత నెలలో ఈమార్కెట్‌యార్డును సందర్శించి మొక్కల పెంపకం చేపట్టారు. అన్ని ఏర్పాట్లు చేస్తున్నారేకానీ, భవనాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే చొరవ చూపి త్వరగా మార్కెట్‌యార్డును ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.



మార్కెట్‌యార్డు ఆవరణలో మొక్కలు నాటిన దృశ్యం

గ్రామ సచివాలయాల తనిఖీ

నల్లచెరువు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం -1, 2లను స్థానిక ఎంపీడీఓ ఆశోక్‌కుమార్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లోని పలు రికార్డులను, ఉద్యోగుల హాజరు రిజిస్టరును పరిశీలించారు. విధు లకు హాజరు కాకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ఉద్యోగులను పద్ధతి మార్చుకోవా లని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాల పంపిణీ

ధర్మవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక, యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాలను సోమవారం స్థానిక శాంతినగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పంపిణీచేశారు. మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు సహకారంతో ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాసే విద్యార్థులకు ఉపయోగపడే మెంటల్ ఎబిలిటీ స్టడీ మెటీరియల్ పుస్తకాలను జేవీవీ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రచురించినట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణనాయక్, పాఠశాలహెచ్‌ఎం ఉమాపతి తెలిపారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా అందజేశామన్నారు.

గౌరవ వేతనాల విడుదలపై హర్షం



సమావేశంలో పాల్గొన్న ఇమామ్‌లు, మౌజన్లు

తనకల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం గౌరవ వేతనం విడుదల చేసిన సీఎం నారాచంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు మండలంలోని ఇమామ్‌లు, మౌజన్లు కృతజ్ఞతలు తెలిపారు. వారు సోమవారం తనకల్లులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పలువురు ఇమామ్‌లు, మౌజన్లకు వైసీపీ పాలనలో గౌరవ వేతనం విడదల చేయలేదన్నాన్నారు. అయితే మాజీ రాష్ట్ర పతి అబ్దుల్‌కలాం జయంతి వేడుకల్లో హామీ ఇచ్చిన 24గంటలలోగా రాష్ట్ర వ్యాప్తంగా ఇమామ్‌లు, మౌజన్లకు బకాయి ఉన్న గౌరవ వేతనం రూ.90కోట్లను కూటమి ప్రభుత్వం విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండలంలో ఇమామ్‌లు, మౌజన్లు, టీడీపీ నాయకులు మహబూబ్ బాషా, రియావుల్లా, రెడ్డిబాషా తదితరులు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి భూమిపూజ

తనకల్లు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని బాలసముద్రం గ్రామ పంచాయతీలోని దళితవాడ వద్ద రామాలయం నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రామాలయానికి కావలసిన విగ్రహాలను టీటీడీ ద్వారా అందించేందుకు కృషి చేస్తున్నట్లు ధర్మప్రచార సంఘం సభ్యులు బాలాజీ తెలిపారు.

'పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి'



మునిసిపల్ హైస్కూల్లో రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్

కదిరి అర్బన్, నవంబరు (ఆంధ్రజ్యోతి): వచ్చే మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పరీక్షల విభాగం అడిషనల్ కమిషనర్ లాజర్ స్థానిక విద్యాధికారులకు సూచించారు. ఆయన సోమవారం పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో పరీక్షల నిర్వహణకు కావాల్సిన ఫర్నీచర్, వసతులను పరిశీలించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలియజేశారు.

బీజేపీ నాయకుడికి పరామర్శ

ధర్మవరం రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపురానికి చెందిన బీజేపీ నాయకుడు శంకర్‌రెడ్డి ఆదివారం తన వ్యవసాయ తోట సమీపంలో పాముకాటుకు గురయ్యాడు. అతడిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించగా చికిత్సలు పొందుతున్నాడు. సోమవారం విషయం తెలుసుకున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు ఆసుపత్రికి వెళ్లి శంకర్‌రెడ్డిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు. బీజేపీ నాయకులు పోతుకుంట రాజు, పోతులనాగేపల్లి లక్ష్మీనారాయణ, పవన్ తదితరులు ఉన్నారు. అలాగే ధర్మవరం పట్టణానికి చెందిన బీజేపీ కార్యకర్త గోవింద కుమార్‌గారి తాత ఉత్తన్న అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు ఉత్తన్న మతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

అడిటోరియంలో గ్రిల్, ఫ్యాన్ల ఏర్పాటు

కొత్తచెరువు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన ఓపెన్ ఆడిటోరియంలో అభ్యుదయ ఫౌండేషన్ నిర్వాహకులు బాల్‌చందన్ రూ.2 లక్షలకుపైగా ఖర్చుతో ఐరన్‌గ్రిల్, ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు వేయించారని బండ్ల పల్లి పాఠశాలహెచ్‌ఎం తెలిపారు. ఓపెన్ ఆడిటోరియం ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారన్నారు. ఈ ఆడిటోరి యానికి గ్రిల్, ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు వేయించడంతో విద్యార్థులు చదువుకోవడానికి ఎంతో దోహ దపడుతుందన్నారు. ఈ విద్యార్థులు ఆడిటోరియాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.



ఓపెన్ ఆడిటోరియానికి గ్రిల్ వేయించిన దృశ్యం

మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి కృషిచేయండి

● ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



మార్కెట్‌యార్డ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొత్తచెరువు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పుట్టపర్తి మార్కెట్‌యార్డ్ ఛైర్మన్, కమిటీ సభ్యులకు సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో సోమవారం పుట్టపర్తి మార్కెట్ కమిటీ సమావేశాన్ని ఛైర్మన్ పూలశివప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పండించిన పంటలను గోడౌన్‌లలో ఉచితంగా నిల్వ ఉంచుకోవచ్చనే విషయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. రైతులు పండించిన పంటల కొనుగోలు కేంద్రాలను త్వరలోనే ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేస్తామన్నారు. రైతులు దళారుల వల్ల నష్టపోతున్నారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మద్దతు ధరతో కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్‌యార్డ్ ఉపాధ్యక్షుడు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

పుట్టపర్తి టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకల సందర్భంగా ఈ నెల 19న ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర సమాచార పౌరసంబంధాలశాఖ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ పరిశీలించారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆయన సోమవారం హిల్‌వ్యూస్టేడియంలో మీడియాగ్యాలరీ, పబ్లిక్ అడ్రస్‌సిస్టం, సౌండ్‌వ్యవస్థ, మొదలైన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు అవసరమైన అన్ని సాంకేతిక, లాజిస్టిక్ ఏర్పాట గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డైరక్టర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం సమగ్ర ఏర్పాట్లను చేపట్టిందని మీడియా ప్రతినిధులు, ప్రజలు సౌకర్యవంతంగా కార్యక్రమం వీక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సమాచారశాఖ చీఫ్ ఇంజనీర్ మధుసూదన్, ఆర్‌జేడీ ఎస్ మహబూబ్‌బాషా, ఒంగోలు ఆర్‌ఐఈ శ్రీదర్‌రెడ్డి డీపీఆర్‌ఓ బాలకొం డయ్య, ఏడీలు పురుషోత్తం మల్లికార్జున తదితర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు



నంబులపూలకుంటలో జెండా ఆవిష్కరిస్తున్న అధికారులు

నంబులపూలకుంట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సోమవారం 72వ అఖిలభారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఛైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, సబ్‌డివిజనల్ సహకార అధికారి ప్రభావతి, సీఈఓ బాబాఫకృద్దీన్ హాజరయ్యారు. ముందుగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ రుణాలు విరివిగా ఇచ్చామని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా అన్ని సేవలు, లావాదేవీలు నిర్వహిస్తున్నామన్నారు. సిబ్బంది సుమశ్రీ, శ్రీరాములు, డైరెక్టర్లు మల్లిరెడ్డి, లక్ష్మీనాయక్, వాటర్ షెడ్ ఛైర్మన్ మహబూబ్‌బాషా, నరసింహులు, గంగశేఖర్, మౌలాసాబ్, చింతా శ్రీనివాసులు, జనార్దననాయుడు, రైతులు పాల్గొన్నారు.



గాండ్లపెంటలో ప్రతిజ్ఞ చేస్తున్న సభ్యులు, అధికారులు

గాండ్లపెంట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం కార్యాలయంలో సోమవారం సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సహకార సంఘం ఛైర్మన్ రామాంజులురెడ్డి ఆధ్వర్యంలో డైరెక్టర్లు, రైతులు సమావేశం నిర్వహించారు. ముందుగా సహకార సంఘం జెండా ఎగురవేసి ప్రతిజ్ఞ చేశారు. సహకార సంఘం డివిజన్ అధికారి జనార్దన్, సీఈఓ షామీర్ బాషా, డైరెక్టర్‌లు మునాఫ్, రమణ, సర్పంచ్ శివప్ప నాయుడు, చంద్ర, మాజీ ఛైర్మన్ వెంకటరమణారెడ్డి, అక్రమ్‌బాషా, నరసింహులు, సికిందర్, కేకే రాజారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వ్యాసరచనలో బత్తలపల్లి విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

బత్తలపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో బత్తలపల్లిలోని విద్యాధరి ఇంగ్లీస్ మీడియం పాఠశాలకు చెందిన తేజదీప్తి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిందని పాఠశాల కరస్పండెట్ లక్ష్మి తెలిపారు. విద్యార్థిని తేజదీప్తికి సోమవారం పుట్టపర్తిలో సత్యసాయి ట్రస్టు ట్రస్ట్ సభ్యులు బహుమతి ప్రదానం చేసినట్లు తెలిపారు. ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఆ విద్యార్థినిని అభినందించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 25వేల మంది విద్యార్థులు వ్యాసరచన పోటీలలో పాల్గొనగా అందులో తమ పాఠశాల విద్యార్థిని జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడంతో, విద్యార్థినిని పాఠశాల కరస్పండెట్ లక్ష్మి, ఉపా ధ్యాయులు శ్రీకాంత్, మహేష్, మంజుల, రేణుక తదితరులు అభినందించారు.

నృత్యంలో రాణించిన ధర్మవరం విద్యార్థిని



నృత్య పోటీల్లో సత్తాచాటిన యామిని

ధర్మవరం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయినగర్‌లో ఉన్న సూర్య స్కూల్ విద్యార్థిని టీఎం యామిని నృత్య పోటీలలో రాణించినట్టు పాఠశాల హెచ్‌ఎం నరేంద్రబాబు, డాన్స్ మాస్టర్ లోకేశ్ తెలిపారు. హైద రాబాద్‌లోని రవీం ద్రభారతిలో ఇటీవల జరి గిన ఇంటర్నేషనల్ డాన్స్ పోటీలలో ధర్మవరానికి చెందిన రాకింగ్ స్టార్ డాన్స్ ఆధ్వర్యంలో పాల్గొన్న యామని ప్రతిభకనబరచి ప్రశంసాపత్రం అందుకున్నట్టు వారు తెలిపారు. యామినిని సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం, డాన్స్‌మాస్టర్ అభినందించారు.

న్యూస్ బాక్స్

స్థానిక సమస్యలు పరిష్కరించండి: మంత్రి



మండల నాయకులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి సవిత మండల నాయకులకు సూచించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పెనుకొండ మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా సమస్యలు ఏవైనా ఉంటే నా దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం వివిధ మండలాల నుంచి వచ్చిన పలువురి వినతులను మంత్రి సవిత తీసుకున్నారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, మాధవనాయుడు, నారాయణస్వామి, కన్వీనర్ ప్రసాద్, సూర్యనారాయణ, బాబుల్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణపై అవగాహన



రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మడకశిర రూరల్/టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అచార్య ఎన్జీ రంగా వ్యవసాయం విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్సీ రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినీదేవి తెలిపారు. ఆమె మాట్లాడుతూ భారత వ్యవసాయ పరిశోధనా మండలి న్యూఢిల్లీ వారి సౌజన్యంతో ఎస్సీ రైతులకు ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. పంటకోత, యాంత్రీకరణ పద్ధతులు, నూతన వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించామన్నారు. అనంతర 50 మంది రైతులకు ఉచితంగా టార్పాలిన్లు పంపిణీ చేశామన్నారు. ప్రాజెక్ట్ సమన్వయకర్త డాక్టర్ శ్రీగిరి, వ్యవసాయ యాంత్రీకరణ విభాగాధిపతి హరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా బిర్సాముండా జయంతి



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు భూతన్న

మడకశిర టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆదివాసి పోరాట యోధుడు బిర్సాముండా 150వ జయంతిని టీడీ పల్లి ఎంపీయూపీ పాఠశాల ఆవరణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కె.భూతన్న మాట్లాడుతూ బిర్సాముండా గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని, భూమి కోసం భుక్తి కోసం గిరిజన పుత్రుల బానిస బతుకుల విముక్తి కోసం పోరాటాలు చేశారని కొనియాడారు. ఉపాధ్యాయులు సూర్యప్రకాష్, రవీంద్ర, గవ్వల రామకృష్ణ, పరమేశ్వర్ పాల్గొన్నారు.

సత్యగీత పుస్తకావిష్కరణ



సత్యగీత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

హిందూపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సప్తగిరి కళాశాలలో వడ్డిసుధాకర్ రచించిన సత్యగీత పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సత్యసాయిబాబా జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు రచయిత తెలిపారు. ఆయన మాట్లాడుతూ బాబా సేవలు అమోఘమని, ఆయన బోధనలు మానవ సంక్షేమానికి నిలయాలని కొనియాడారు. ఆయన దైవస్వరూపమన్నారు. లేపాక్షి ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఈశ్వర్‌రెడ్డి, విశ్వనాథ్, గంగిరెడ్డి, కర్ణాటకకు చెందిన కవులు అమర్నాథ్, రాధామణి, రాజ్యలక్ష్మి, ప్రసన్న పాల్గొన్నారు.

సహకార రత్న పురస్కారానికి విశ్వనాథ్ ఎంపిక



పావగడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సహకార రంగంలో పలు సేవలు అందించిన గాయత్రి కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ఎంఎస్ విశ్వనాథ్ సహకార రత్న పురస్కారానికి ఎంపికయ్యారు. 28ఏళ్లుగా వివిధ రంగాల్లో సేవలందించి ప్రజల మన్ననలు పొందిన విశ్వనాథ్ కర్నాటక రాష్ట్ర వసతి మహామండలి డైరెక్టర్‌గా గతంలో సేవలందించారు. తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, కన్నడ సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు ఆర్జీ ఖానలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి: ఎస్టీయూ

సోమందేపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి ఎస్జీటీలను స్కూల్ అసిస్టెంట్లుగా, స్కూల్ అసిస్టెంట్లను డైట్ కళాశాల, జూనియర్ కళాశాల లెక్చరర్లుగా పదోన్నతి కల్పించాలన్నారు.

టీఏపీసీఎంఎస్ అధ్యక్షుడిగా నరసింహయ్య

పావగడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యవసాయ సహకార సంఘానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాటి మేకలపల్లి నరసింహయ్య సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 12మంది వ్యవసాయ సహకార సంఘాలకు డైరెక్టర్‌గా నరసింహయ్యను ఎన్నుకున్నట్లు రిటర్నింగ్ అధికారి వెంకటేష్ తెలిపారు. ఆయన ఎంపిక పట్ల మున్సిపల్ అధ్యక్షుడు సుదేశ్‌బాబు, శంకర్‌రెడ్డి, శేషగిరి, నారాయణప్ప హర్షం వ్యక్తం చేశారు.



నరసింహయ్యను సన్మానిస్తున్న సభ్యులు

రోడ్డుపై వాహనాల పార్కింగ్

- తరచూ ట్రాఫిక్ జామ్‌తో ప్రజల పాట్లు
- పట్టించుకోని పోలీసులు, నగర పంచాయతీ అధికారులు



రోడ్డు మధ్యలో పార్క్ చేసిన వాహనాలు

మడకశిర టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్ గాంధీ సర్కిల్‌లో కూరగాయల మార్కెట్ నిర్వహిస్తుండటంతో వాహనాలు అన్నీ రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. సంతరోజు ద్విచక్ర వాహనాలు అన్నీ రోడ్డుపైనే నిలపడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బస్సులు, కార్లు, లారీ ఇతర వాహనాలు వెళ్లేందుకు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. గతంలో మార్కెట్ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకొన్నా వైసీపీ ప్రభుత్వం రాగానే కనుమరుగు కావడంతో కూరగాయల మార్కెట్, డైలీ, వారపు సంత రాజీవ్‌గాంధీ సర్కిల్‌లోనే నిర్వహిస్తున్నారు. దీంతో వాహనాలు పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే నిలపాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం డ్రైనేజీ పనులు జరుగుతుండటంతో వాహనాలు మరింత రోడ్డుపైన నిలుపుతున్నారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ ద్విచక్ర వాహనాలు, ఆటోలు నిలుపుతుండటంతో కూరగాయల మార్కెట్‌కు వెళ్లే మహిళలు, కొనుగోలుదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపుతున్నా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో సమస్యను పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో పోలీసులు ట్రాఫిక్ సమస్యను కొంత వరకు పరిష్కరించారు. పరిస్థితి మొదటికి వచ్చిందని పట్టణ వాసులు వాపోతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన రైతులు, ప్రజలు కొనుగోలు చేయడానికి అనేక మంది వస్తుండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కష్టకాలంలో ఉన్నవారిని పార్టీ గుర్తిస్తుంది

- టీడీపీ బలం కార్యకర్తలే
- క్లస్టర్ యూనిట్ ఇన్చార్జ్‌లతో ఎమ్మెల్యే బాలకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ వెన్నంటే ఉంటుందని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ భరోసా ఇచ్చారు. సోమవారం పట్టణంలోని సాయితేజ, కల్యాణమండపంలో క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్చార్జ్‌లతో సమావేశం అయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ హయాంలో ఎన్ని బాధలొచ్చినా, వారు ఎంత వేధించినా పార్టీ వెంటే ఉన్న ప్రతి కార్యకర్తకు తాను అండగా నిలుస్తానన్నారు. స్థానిక ఎన్నికల్లో క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్చార్జ్‌లకు అవకాశం కల్పిస్తామన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నన్ను మూడుసార్లు హిందూపురం నుంచి గెలిపించినందుకు జీవితాంతం ఈ నియోజకవర్గానికి రుణపడి ఉంటానన్నారు. కార్యకర్తకు ఏదైనా సమస్యవస్తే నేరుగా తనకే చెప్పుకోవచ్చన్నారు. ఏ ఒక్క టీడీపీ కార్యకర్తను ఎవరూ తాకలేరన్నారు. దేశంలోనే టీడీపీకి ఉన్న కార్యకర్తలు ఏ రాజకీయ పార్టీకి ఒక్కరాష్ట్రంలో అంతమంది లేరన్నారు. పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తీచేస్తున్న బూత్ ఇన్చార్జ్‌లకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కొంత మంది యూనిట్, బూత్ ఇన్చార్జ్‌లకు వారి సమస్యలను ఎమ్మెల్యేకు చెప్పుకున్నారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, క్లస్టర్ ఇన్చార్జ్‌లు అమర్నాథ్, చంద్రమోహన్, ప్రవీణ్, రాఘవేంద్ర, రవీంద్రనాయుడు, మారుతిప్రసాద్, రంగారెడ్డి, డైరెక్టర్లు చంద్రమోహన్, గంగాధర్, పరిమళ, జయప్ప, టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణాచలరెడ్డి, మంజునాథ్, ఉమాశంకర్‌రెడ్డి, ఆదినారాయణ, రామక్రిష్ణారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయండి

ఆసియా ఖండంలోనే అతిపెద్ద చింతపండు మార్కెట్ హిందూపురంలో ఉందని, ఇక్కడ అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి ఎమ్మెల్యే బాలకృష్ణను కోరారు. సోమవారం ఎమ్మెల్యేతో మార్కెట్ పాలకవర్గం సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్‌యార్డ్‌లో చింతపండు, మిరపకాయల సీజన్‌లో సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది రైతులు, హమాలీలు వస్తారన్నారు. ఇక్కడ క్యాంటీన్ ఏర్పాటు చేస్తే రైతులకు ప్రయోజనంగా ఉంటుందన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. మార్కెట్‌యార్డ్ తరఫున పల్లెలకు లింకురోడ్డు నిర్మాణానికి నిధులు ఇప్పించాలని కోరారు. మార్కెట్‌యార్డ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థిని జ్యోత్స్నతో టీచర్లు

గోరంట్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి గోరంట్ల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎంలు మాలతి, రామాంజులు తెలిపారు. అండర్-17 విభాగం బేస్‌బాల్ జిల్లాస్థాయి పోటీల్లో గోరంట్ల బాలికల ఉన్నతపాఠశాల విద్యార్థిని జ్యోత్స్న, పాలసముద్రం ఉన్నతపాఠశాల విద్యార్థులు జగన్మోహన్‌రెడ్డి, భవిత విజేతలుగా నిలిచారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 27వ తేదీన ప్రారంభమయ్యే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. గెలుపొందిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు రేఖ, ప్రమద, గంగరాజు పాల్గొన్నారు.

రచయిత అందెశ్రీకి ఘన నివాళి

అమరాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజాకవి, రచయిత డాక్టర్ అందెశ్రీకి శివకుమార్, దళిత నాయకులు నివాళి అర్పించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకుడు నారాయణ, ఉప్పరపల్లి సిద్దేశ్, సురేష్, శివన్న పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

రొద్దం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 58వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. సోమవారం రొద్దం శాఖ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉపాధ్యాయుడు రామాంజనేయులు విద్యార్థులకు కవుల గురించి వివరించారు. పోతన, యర్రాప్రగడ, వాల్మీకి కవుల గురించి క్లుప్తంగా వివరించారు. గ్రంథాలయ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

రొద్దం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారనాగేపల్లి గ్రామానికి చెందిన కురుబ నాగరాజు భార్య చిట్టి(35) పాముకాటుతో మృతిచెందింది. సోమవారం చిట్టి అనే మహిళ ఆవులు మేపడానికి పెన్నానది గట్టున ఉన్నపొలాల్లోకి తీసుకెళ్లగా పాముకాటేసింది. విషయాన్ని వెంటనే భర్తకు తెలియజేయగా పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. చిట్టికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఘర్షణలో నలుగురికి గాయాలు

పెనుకొండ రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు స్థలం విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడటంతో నలుగురు గాయపడిన సంఘటన సోమవారం మునిమడుగులో చోటుచేసుకుంది. కియ పోలీసులు తెలిపిన మేరకు బాలాజీ, శ్రీనివాసులు గ్రామంలో ఎదురెదురుగా నివాసముంటున్నారు. ఇంటిముందు స్థలం విషయంలో గొడవపడి ఒకరిపై ఒకరు రాళ్లు, కర్రలతో దాడిచేసుకున్నారు. దాడిలో బాలాజీ, కుమార్తె సరస్వతి, శ్రీనివాసులు, తల్లి నారాయణమ్మ గాయపడ్డారు. స్థానికులు గాయపడిన వారిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యాబోధన పరిశీలనపై శిక్షణ

గోరంట్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాన్ని మదింపు చేసే కార్యక్రమంపై శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈఓ గోపాల్ తెలిపారు. పట్టణంలోని ఉర్దూ ఉన్నతపాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో టీచ్‌టోల్ రీఫ్రెషర్ రెండురోజుల శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. మండలంలో ఎంపికైన 30మంది పరిశీలకులకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణానంతరం వీరు పాఠశాలలను సందర్శించి తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధనను పరిశీలిస్తారన్నారు. నిర్దేశించిన 29 అంశాలపై పరిశీలించి, మదింపు చేస్తారన్నారు. హెచ్‌ఎం పద్మావతి, ఆర్పీలు సుధాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్ ఉన్నారు.

సత్యసాయి శతజయంతికి తరలిరండి

రొద్దం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలోని భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి వేడుకలకు 30ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు రవి తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు రొద్దం నుంచి మూడు బస్సులు మండలంలోని అన్ని గ్రామాలకు 30 బస్సులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. బుధవారం స్టేడియంలో ఆధ్యాత్మిక సభకు విచ్చేయనున్న ప్రధాని మోదీ ప్రసంగాన్ని తిలకించి తిరిగి రావాలన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు సర్వే

రొద్దం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దళితవాడలో ఇళ్లులేని నిరుపేదలను గుర్తించేందుకు అధికారులు, నాయకులు సర్వేచేపట్టారు. సోమవారం దళితవాడలోని ఇళ్లులేని నిరుపేదలవద్దకు వెళ్లి సర్వేద్వారా గుర్తించారు. ప్రభుత్వం అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇల్లు నిర్మిస్తుందని మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ సోనియా, సింగిల్‌విండో అధ్యక్షుడు వీరాంజనేయులు, చెన్నకేశవులు, సిద్దన్న, రుద్రప్రసాద్, చిరంజీవి, రాజేష్, నాగ పాల్గొన్నారు. పక్కా గృహాల కోసం నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ఖాజామొయినుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 30వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.

ఉపాధ్యాయులు, ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న గురుకుల పాఠశాల టీచర్లు

రొళ్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలం దొమ్మరొట్టి గ్రామంలో ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న 35మందిలో 30మంది పార్ట్‌టైం ఉద్యోగులు తమ సమస్యల పరిష్కరించాలని సోమవారం నిరసన తెలిపారు. మొదటగా ప్రిన్సిపాల్ మైలారప్పకు వినతి పత్రం అందించారు. అనంతరం విధులు బహిష్కరించారు. వారు మాట్లాడుతూ 10 నుంచి 15ఏళ్లగా తాము విధులు నిర్వహిస్తున్నారు. పేరుకే పార్ట్‌టైం కానీ ఫుల్‌టైం పనిచేయిస్తున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పార్ట్‌టైం నుంచి కాంట్రాక్ట్ చేయాలని, నెల జీతాలు పక్కాగా చెల్లించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

పుష్కలంగా ఎరువులు, యూరియా

సోమందేపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో రైతులకు అవసరమైన ఎరువులు, యూరియా పుష్కలంగా ఉన్నట్లు అధ్యక్షుడు పూల వెంకటేశులు తెలిపారు. అవసరమైన రైతులు ఆధార్ కార్డు తీసుకొచ్చి వాటిని తీసుకెళ్లవచ్చన్నారు. సోమవారం సింగిల్‌విండో కార్యాలయ గోదాము వద్ద మొక్కజొన్న, వరి, మల్బరీ రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. మండలంలో ఎరువుల కొరత లేకపోయినా వాటికి డిమాండ్ తగ్గడంలేదు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం



గ్రామస్తులతో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సభ్యులు

పెనుకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 ఏడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం సోమవారంతో ముగిసింది. ఆఖరిరోజు ఎన్‌ఎస్‌ఎస్ అధికారి జయప్ప ఆధ్వర్యంలో మంగాపురం గ్రామంలో డ్వాక్రా భవన్ చుట్టూ శుభ్రంచేసి బ్లీచింగ్ చెల్లారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓ జయప్ప, వలంటీర్లతో కలిసి వికసిత్ భారత్ 2047లో యువత పాత్ర అనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం మంగాపురం గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలను గుర్తించిన మాజీ సర్పంచ్ చంద్రకాంతమ్మ దంపతులు, గ్రామస్థులు పీఓ జయప్పను ఘనంగా సత్కరించారు. ఎన్‌ఎస్‌ఎ్ ఎ శిబిరానికి సహకారం అందించిన మాజీ సర్పంచ్, గ్రామస్థులుసత్కరించారు. అధ్యాపకులు ప్రతాప్, రామన్న, నాగేష్‌గౌడ్, చంద్రమోహన్, మారుతి పాల్గొన్నారు.


శివోహం..

కార్తీక మాసం చివరి సోమవారం ప్రత్యేక పూజలు




అలంకరణలో శివుడు

హిందూపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని శివాలయాలకు భక్తులు క్యూకట్టారు. పంచాక్షరి నామాన్ని జపిస్తూ శివునికి అభిషేకాలు చేశారు. ఉపవాసాలతో దీపారాధన చేశారు. శివున్ని దర్శించుకునేందుకు సోమవారం ఉదయం భక్తులు పోటెత్తారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బసవనపల్లి శివాలయం వద్ద లక్ష దీపోత్సవం నిర్వహించారు.



బసవనపల్లి వద్ద లక్ష దీపోత్సవంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కోట శివాలయంలో సామూహిక రుద్రాభిషేకం నిర్వహించారు. దక్షిణామూర్తి శ్రీకంఠపురం మేళాపురం గాంధీ సర్కిల్‌లో ఉన్న శివాలయాల్లో, త్యాగరాజ్‌నగర్‌లో ఉన్న ఆలయాల్లో భక్తులు దీపాలు వెలిగించారు. బసవనపల్లి శివాలయం సమీపంలో అతిపెద్ద శివుని విగ్రహం వద్ద వేలాది మంది భక్తులు దీపాలు వెలిగించారు.



పరిగిలో లక్ష దీపోత్సవం

పరిగి(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నాలుగో సోమవారాన్ని పురస్కరించుకుని స్థానిక బీరలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మహిళలు లక్ష దీపాలను వెలిగించారు. ఈశ్వరున్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరై దీపాలు వెలిగించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.



రొద్దకాంబకు హారతి ఇస్తున్న పూజారి

రొద్దం (ఆంధ్రజ్యోతి): రొద్దంలోని పురాతన దేవాలయం రొద్దకాంబ గర్భగుడి నిర్మాణం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఆలయంలో అర్చకులు పూజలు నిర్వహించి గర్భగుడి ముఖద్వారం, అంతరాలయ ముఖద్వారం ఏర్పాటుచేశారు. టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, పూజల్లో పాల్గొన్నారు. భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అశ్వత్థనారాయణ, చెన్నకేశవులు, సిద్దన్న, చిరంజీవి పాల్గొన్నారు.



అలంకరణలో వీరముద్దప్పస్వామి

గుడిబండ: మండలంలోని ఆచారిపాళెం గ్రామ సమీపంలో వెలిసిన వీరముద్దప్పస్వామి, తిమ్మప్పస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



చంద్రమౌళీశ్వరస్వామి

మడకశిరటౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చంద్రమౌళీశ్వరస్వామి, మిట్టబండ ఆంజనేయ స్వామి, అభయాంజనేయస్వామి, కోట వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. షిర్డీసాయి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఆకు పూజ, అబిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



జడే శంకరస్వామి

అగళి(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జడే శంకరస్వామి ఆలయంలో కార్తీకమాసం సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా భక్తులు హరోంహర మహాదేవ శంభోశంకర అంటూ శివనామస్మరణతో ఆలయం మారమోగింది. ఉదయం 6 నుంచే స్వామికి అభిషేకాలు, రంగురంగుల పూలతో అలంకరించి మహానైవేద్యం సమర్పించి అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.



పూజల్లో పాల్గొన్న ఎంపీ బీకే పార్థసారథి, నాయకులు

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని వివిధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక ఐముక్తేశ్వర ఆలయంలో ఎంపీ బీకే పార్థసారథి. టీడీపీ నాయకులు రవిశంకర్, బీకే అల్లుడు శశిభూషణ్, పులగూర్ల శ్రీనివాసులు, గుట్టూరు సుబ్బరాయుడు హాజరై పూజల్లో పాల్గొన్నారు. పెనుకొండ నియోజకవర్గం టీడీపీ అబ్జర్వర్ నరసింహారావు, పార్టీకన్వీనర్ శ్రీరాములుయాదవ్, రమణమ్మ, సుబ్రహ్మణ్యం చంద్రాయుడు, నంజుండ, సోము, మల్లికార్జున, సాయిరమేష్, తదితరులు పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు వీరిని సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు.

నిత్యాన్నదానం ప్రారంభం



భోజనం వడ్డిస్తున్న చైర్మన్ రమేష్

హిందూపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. 15 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. సోమవారంతో ప్రారంభించి జనవరి 3వరకు కొనసాగిస్తామని మున్సిపల్ చైర్మన్ రమేష్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌గని, నూగూరు ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ వైసీ చంద్రశేఖర్, గురుస్వామి రవితాగూర్, కొండయ్య, సంజీవ, నరసింహ, హనుమంతు పాల్గొన్నారు.